భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 41.0
కనిష్ఠం : 27.0

కొత్తపాడు సొసైటీ కార్యదర్శి ఆత్మహత్య 5

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
3
శనివారం 26 ఏప్రిల్ 2025



ఇసుక లోడుతో లంక గ్రామంలో వెళుతున్న టిప్పర్లు

ఇసుక అక్రమ తవ్వకాలు

ఇసుక అక్రమ తవ్వకాలకు అడ్డు అదుపు లేకుండా పోయింది. ఆచంట నియోజకవర్గ పరిధిలోని నడిపూడి, కోడేరు, భీమలాపురం, కరుగోరుమిల్లి, ర్యాంపులలో ఇసుక, బొండు మట్టి అడ్డగోలుగా తవ్వేస్తున్నారు. సీఆర్‌జడ్ పరిధిలో ఇసుక మట్టి తవ్వకాల్లో నిషేధం ఉన్నప్పటికీ యథేచ్ఛగా యంత్రాలతో తవ్వేస్తున్నారు. 5

పర్యాటకం భయం భయం..

కశ్మీర్ అందాలు చూడాలని పర్యాటకుల కల. జిల్లా నుంచి పలువురు వేసవిలో కశ్మీర్ పర్యటనకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఉగ్రవాదుల దాడి నేపథ్యంలో వారంతా షాక్‌కు గురయ్యారు. కొందరు పర్యటన రద్దు చేసుకుంటే మరికొందరు ఇతర ప్రాంతాలకు పర్యటన మార్చుకున్నారు. ట్రావెల్ ఏజెంట్లను సంప్రదించి పర్యటన షెడ్యూల్ మార్చుకుంటున్నారు. 4



పహల్గాం పర్యటనలో నరసాపురం వాసులు (ఫైల్)

నేడు మత్స్యకార భరోసా పంపిణీ

నరసాపురం టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): వేట నిషేధ సమయంలో ప్రభుత్వం మత్స్యకార భరోసా పేరిట ఆర్థిక సాయం అందజేస్తుంది. మత్స్యకారులకు జనసేన పార్టీ కార్యాలయం వద్ద శనివారం చెక్ అందించనున్నట్లు ఉమ్మడి పశ్చిమ జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు మైలా వసంతరావు తెలిపారు. నరసాపురం, మొగల్తూరు మండలాల్లో మొత్తం 1750 మంది సముద్రంపై వేటాడే మత్స్యకారులు ఉన్నారన్నారు. వారికి రూ 20వేలు చొప్పున చెక్కు అందిస్తారన్నారు. మంత్రి నిమ్మల రామానాయుడు, కలెక్టర్ నాగ రాణి, ప్రభుత్వ విప్ నాయకర్ పాల్గొంటారన్నారు.

జాతీయ లోక్ అదాలత్ వాయిదా

ఏలూరు క్రైం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : జాతీయ లోక్ అదాలత్ మే 10న నిర్వహించాల్సి ఉండగా జూలై 5వ తేదీకి వాయిదా పడిందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్న ప్రసాద్ తెలిపారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల్లో రెండో జాతీయ లోక్‌అదాలత్ జూలై 5న జరుగుతుందని, కక్షిదారులు గమనించాలన్నారు.

నేడు జిల్లా కోర్టులో వర్క్‌షాప్

ఏలూరు జిల్లా కోర్టు ప్రాంగణంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని న్యాయాధికారులకు ఒకరోజు వర్క్‌షాపు శనివారం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి హైకోర్టు జడ్జిలు జస్టిస్ కె.మన్మథరావు, జస్టిస్ డాక్టర్ వీఆర్‌కే కృపాసాగర్ హాజరు కానున్నారు. జస్టిస్ మన్మధరావు ఉదయం 9 గంటలకు, జస్టిస్ డాక్టర్ కృపాసాగర్ ఉదయం 9.30 గంటలకు ఏలూరు రెవెన్యూ అతిథి గృహానికి చేరుకుంటారు. అనంతరం జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించే వర్క్‌షాపులో వారు పాల్గొంటారు.



కల్లాలు ఖాళీ..

ఖాతాలు నిండె

జిల్లాలో ధాన్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. కల్లాల నుంచి ధాన్యం తరలించగానే రైతుల ఖాతాలో సొమ్ము జమ అవుతోంది. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి తేమ శాతంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. అవసరమైన గోనె సంచులు అందుబాటులో ఉంచి అమ్మకాలకు అనువైన ఏర్పాట్లు చేస్తున్నారు. వెంటనే సొమ్ము అందడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- 2,07,721 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు
- రైతులకు రూ.450 కోట్ల చెల్లింపు
- విక్రయానంతరం కనిష్ఠంగా 4 గంటలు గరిష్ఠంగా 48 గంటల్లో సొమ్ము జమ

పెంటపాడు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయి. 261 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని రైతుల నుంచి సేకరిస్తున్నారు. వాతావరణం అనుకూలించడంతో కల్లాల నుంచి నేరుగా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు. వారం రోజుల క్రితం మబ్బులు, చిరుజల్లులతో రైతులు ఆందోళన చెందారు. సరిపడా సంచులు కూడా అందుబాటులో ఉన్నాయి. ఐదేళ్లుగా ధాన్యం అమ్మకాలలో ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులు ప్రస్తుతం సాఫీగా అమ్మకం సాగిస్తున్నారు. కల్లాల్లో ధాన్యం వెంటనే అమ్మకానికి వెళ్లడంతో పాటు ఆన్‌లైన్‌లో నమోదైన 24 నుంచి 48 గంటల వ్యవధిలో రైతుల ఖాతాలో సొమ్ము జమ అవుతోంది. చాలామందికి నాలుగు లేక ఐదు గంటల్లోనే నగదు జమ అవుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా పౌర సరఫరాల మేనేజర్ టి.శివరామప్రసాద్ క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులతో నేరుగా మాట్లాడుతున్నారు. సకాలంలో సొమ్ములు జమ అవుతున్నాయా, సంచులు, ట్రక్ షీట్ ఇబ్బందులపై ఆరా తీస్తున్నారు. ధాన్యం అమ్మకాలలో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలంటూ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

2,07,721 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

వాతావరణం అనుకూలించడంతో అధికారులు నిత్యం క్షేత్రస్థాయి పర్యటనలతో తేమశాతం 17 వచ్చేలా చూసి అమ్మకాలు జరుపుకోవాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన 261 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులు జోరుగా అమ్మకాలు జరుపుతున్నారు. జిల్లాలో ఇప్పటివరకు 21920 మంది రైతుల నుంచి రూ.479 కోట్ల విలువైన 2,07,721 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇప్పటివరకూ రైతుల ఖాతాల్లో రూ. 450 కోట్లు జమ అయ్యాయి. ఇంకా రూ.29 కోట్లు మాత్రమే రైతులకు చెల్లించాల్సి ఉంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నెలల తరబడి రైతులు ధాన్యం సొమ్ముల కోసం పడిగాపులు కాయాల్సి వచ్చేది. ప్రస్తుతం ధాన్యం అమ్మిన కొద్ది గంటల వ్యవధిలో సొమ్ము జమ అవుతుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటివరకు 90,14,453 సంచుల పంపిణీ

గత వైసీపీ ప్రభుత్వంలో ధాన్యం అమ్మకాలకు రైతుల ఇబ్బందులు వర్ణణాతీతం. ఆరబెట్టిన ధాన్యాన్ని సంచులలో వేసుకుందామంటే అవికూడా నాణ్యతగా ఉండేవి కాదు. ప్రస్తుతం రైతులకు అవసరమైన గోనె సంచులను మిల్లుల్లో ముందుగానే సిద్ధం చేసి పెడుతున్నారు. దాళ్వా సీజన్‌లో 90,14,453 సంచులను రైతుసేవా కేంద్రాల ద్వారా అందజేశారు. వీటిలో రైతులు 51,93,025 సంచులను వినియోగించుకున్నారు. జిల్లాలో 3480 మంది హమాలీలు ధాన్యం కొనుగోలులో పని చేస్తున్నారు. ధాన్యం రవాణాకు 3416 వాహనాలను రిజిస్ట్రేషన్ చేయించి ఎటువంటి ఇబ్బందులు రాకుండా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ధాన్యం అమ్మకాలలో సమస్యలు ఉంటే కంట్రోల్ రూం నెంబర్ 8121676653లో తెలియజేయాలని సూచిస్తున్నారు.

నాలుగు గంటల్లో నగదు జమ



ఆరు ఎకరాలు సాగు చేశాను. ధాన్యం అమ్మకాలలో ఎలాంటి ఇబ్బంది లేదు. ధాన్యం అమ్మిన 4 గంటల్లో నా ఖాతాలో నగదు జమ అయింది. చాలా సంతోషంగా ఉంది. ఇప్పటివరకూ ధాన్యం అమ్మిన సొమ్ములు సకాలంలో అందక ఇబ్బందులు పడ్డాం.

- వెలగల వెంకట శ్రీనివాసరెడ్డి, రైతు, పెంటపాడు

సంచుల ఇబ్బంది లేదు



పది ఎకరాలు కౌలుకు సాగు చేశాను. రైతు సేవా కేంద్రాల ద్వారా గోనె సంచులు సకాలంలో ఇస్తున్నారు. గంటల వ్యవధిలోనే ఖాతాలో సొమ్ములు జమ అవుతున్నాయి.

- బయ్యే వెంకటేశ్వరరావు, కౌలు రైతు, బిళ్లగుంట

వినియోగదారులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసేందుకు ఏపీఈపీడీసీఎల్ దృష్టి పెట్టింది. జిల్లాలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి రూ.170 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు చేశారు. లోఓల్టేజీ సమస్య పరిష్కారానికి జిల్లాలో 315 కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికి 242 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. మరో 73 ట్రాన్స్‌ఫార్మర్లు రావాల్సి ఉంది. వేసవిలో వినియోగదారులకు మెరుగైన విద్యుత్ అందించడానికి ఏర్పాట్లు చేశారు.

1912కు ఫోన్ చేయండి

ఏవిధమైన విద్యుత్ సమస్యలకు అయిన 1912కి ఫోన్ చేస్తే తక్షణం స్పందించి చర్యలు తీసుకుంటారు. సమస్య పరిష్కారం అయిన తరువాత కూడా మీకు ఫోన్ చేసి పరిష్కార వివరాలు తెలియజేస్తారు. 24గంటలు ఈ నెంబరు అందుబాటులో ఉంటుంది.అలాగే 9490610152 నెంబరుకు ఫోన్ చేసి మీ సమస్యను తెలుపవచ్చు.

3 సబ్ స్టేషన్లకు ప్రతిపాదనలు

జిల్లాలో పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా అందించేందుకు కొత్తగా 33.12కేవీ సబ్ స్టేషన్లు ప్రతిపాదించాం. యలమంచిలి మండలం మేడపాడు, కాళ్ల మండలం కోనలపల్లిలో ఏర్పాటు చేయబోతున్నాం. మూడు చోట్ల సబ్‌స్టేషన్ నిర్మాణాలు పూర్త య్యాయి. పాలకొల్లు బ్రాడీపేటలో సబ్ స్టేషన్ ఈ నెల 30 నుంచి అందుబాటులోకి రానుంది. తాడేపల్లిగూడెం కస్పాపెంటపాడులో కొత్త సబ్‌స్టేషన్ వచ్చేనెల 15 నుంచి అందుబాటులోకి రానుంది. భీమవరం మండలం లోసరిలో సబ్‌స్టేషన్ మే నెలా ఖరునాటికి అందుబాటులోకి రానుంది.



పోన్‌లో వినియోగదారుల సమస్యలు వింటున్న ఎస్ఈ రఘునాథబాబు

నాణ్యమైన విద్యుత్ అందిస్తాం

ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ రఘునాథబాబు

ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్

- విద్యుత్ సమస్యల పరిష్కారానికి రూ.170 కోట్లతో ప్రతిపాదనలు
- లోఓల్టేజీ నివారణకు చర్యలు
- 3చోట్ల 33/11 కెవి సబ్‌స్టేషన్లు
- సోలార్ విద్యుత్ వినియోగించాలి
- వినియోగదారుల సమస్యలపై అధికారులకు తక్షణ ఆదేశాలు

భీమవరం టౌన్/అర్బన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాలో సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపడతాం, ఆయా ప్రాంతాలను డివిజన్ అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ అలపాటి రఘునాథబాబు తెలిపారు. జిల్లాలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి రూ.170 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు చేసినట్లు వివరించారు. అవసరమైతే కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. ఆంధ్రజ్యోతి శుక్రవారం నిర్వహించిన ఫోన్‌ఇన్ కార్యక్రమంలో విద్యుత్ వినియోగదారుల సమస్యలపై ఆయన స్పందించారు. కొన్ని సమస్యల పరిష్కారానికి అప్పటికప్పుడే ఆదేశాలు ఇచ్చారు. మరికొన్ని పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

- వేసవిలో విద్యుత్ ఇబ్బందులతో నరకం చూస్తున్నాం. ఐదేళ్లుగా లోఓల్టేజ్ సమస్య ఉంది. తణుకు పట్టణంలో సుదర్శన్ నగరంలో సమస్య పరిష్కరించాలి.
  - వీరలక్ష్మి, తణుకు

ఎస్ఈ: అధికారులను పంపించి సమస్యకు కారణాలు తెలుసుకుని సమస్యకు పరిష్కారం చేస్తాం.

- మారుతీ నగర్ కాలనీలో చిన్న పార్కు బయట ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను పార్క్‌లోకి ఎందుకు మారుస్తున్నారు.
  - సూర్యారావు మారుతీనగర్, భీమవరం

ఎస్ఈ: అధికారులతో మాట్లాడతాం. ట్రాన్స్‌ఫార్మర్ మార్పుకు గల కారణాలు తెలుసుకుని తెలియజేస్తాం.

- సత్యనారాయణపురం ఏరియాలో వీధిలైట్లు వెలగడం లేదు.. రాత్రి పూట ఇబ్బందిగా ఉంటుంది. విద్యుత్ సరఫరా ఇబ్బందులతో మోటార్లు కాలిపోతున్నాయి.
  - దొడ్డిపట్ల రామలింగం, లంకలకోడేరు

ఎస్ఈ: విద్యుత్ లైన్ మార్పులపై తక్షణ చర్యలకు ఆదేశిస్తాం. ఓల్టేజీ ఎక్కువ ఎందుకు వస్తుందో పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతాం.

సోలార్ విద్యుత్ వినియోగించుకోండి

సూర్యఘర్ పేరిట సోలార్ విద్యుత్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం రాయితీ అందిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా, బీసీలకు రూ.20 వేలు అదనపు రాయితీ ఇస్తోంది. సొంత ఇళ్లతో పాటు అద్దె ఇళ్లలో ఉన్నవారు కూడా ఈ పథకాన్ని వినియోగించుకోవచ్చు. సోలార్ ప్యానల్ ఏర్పాటుకు ప్రభుత్వ సబ్సిడీ ఇస్తుంది. మిగులు విద్యుత్‌ను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. వివరాల కోసం ఎస్ఈ కార్యాలయంలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటుచేశాం. గ్రామాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

- లోఓల్టేజీ సమస్యతో ఇబ్బంది పడుతున్నాం. ప్రభుత్వం మారినా సమస్య పరిష్కారం కాలేదు.
  - ఎ.కాంతారావు, తణుకు

ఎస్ఈ: లోఓల్టేజీ సమస్యకు కారణాలు పరిశీలించి పరిష్కారానికి చర్యలు చేపడతాం.

- పెద తాడేపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్ అపహరించారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయలేదు.
  - జి.మురళీకృష్ణ, పెద తాడేపల్లి

ఎస్ఈ: గ్రామంలో తొందరలోనే కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయిస్తాం.

- బేతపూడిలో సీసీ రోడ్డు నిర్మాణంతో ఎత్తు పెరిగి విద్యుత్ వైర్లు చేతికందుతున్నాయి.
  - కొట్టి పద్మరావు బేతపూడి

ఎస్ఈ: వెంటనే పరిశీలించి వైర్లు పైకి ఉండేలా చర్యలు చేపడతాం.

- ఆక్వాసాగు జోన్‌లో లేని రైతులకు సబ్సిడీపై విద్యుత్‌ను ఎప్పుడు అందిస్తారు. **- నాగేంద్ర, ఆకివీడు**

ఎస్ఈ: ఆక్వా రైతులందరికీ విద్యుత్ సబ్సిడీపై ప్రస్తుతానికి ఎటువంటి ఆదేశాలు లేవు, ఆక్వా జోన్‌లో ఉన్న ఆక్వా రైతులకు మాత్రమే సబ్సిడీ వర్తిస్తుంది.

- దువ్వ 1వ వార్డులో ఓల్టేజి సమస్య ఉంది. విద్యుత్ అంతరాయంపై అధికారులకు ఫిర్యాదు చేశాను.
  ఆలపాటి ఉమాశేషగిరి దువ్వ

ఎస్ఈ: లోఓల్టేజి సమస్య ఎందుకు వస్తుందో పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు చేపడతాం.

- భారతీయ విద్యాభవన్స్ దగ్గర పవన్ వెంచర్స్ కాలనీలో రాత్రులు విద్యుత్ సరఫరా సరిగా ఉండడం లేదు.
  - చెన్నమిల్లి శ్రీనివాస్, భీమవరం

ఎస్ఈ: వెంచర్ యజమానితో మాట్లాడి మెరుగైన విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటాం.

- నరసాపురం స్టీమర్ రోడ్డులో కరెంటు వైర్లు పాత కాలం నాటివి కావడంతో తెగిపోతున్నాయి.
  - చెరుకూరి వెంకటరాజు, స్టీమర్ రోడ్డు, నరసాపురం

ఎస్ఈ: సమస్యను పరిశీలించి అవసరమైతే వైర్లు మార్చేలా చర్యలు తీసుకుంటాం.



విద్యాశాఖ అధికారులతో సమీక్ష చేస్తున్న కలెక్టర్ నాగరాణి

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్చండి

విద్యాశాఖ అధికారులకు కలెక్టర్ నాగరాణి సూచన

భీమవరం టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల చేరికపై దృష్టి సారించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధనపై ఇంటింటి ప్రచారంతో తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. విద్యా శాఖ అధికారులతో శుక్రవారం కలెక్టర్ సమీక్షించారు. సుశిక్షితులైన ఉపాధ్యాయులు, అన్ని మౌలిక వసతులతో ప్రభుత్వ పాఠశాలలు నడుస్తున్నాయన్నారు. గ్రామ, మండల స్థాయిలో ప్రణాళికలను సిద్ధం చేసుకుని మండల ప్రత్యేకాధి కారి, ఎంఈవో, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలలపై అవగాహన కల్పించాలని సూచించారు. డీఈవో ఇ.నారా యణ, సమగ్ర శిక్ష ఏపీసీ పి.శ్యాంసుందర్ పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. దివ్యాంగుల హక్కుల చట్టం-2016 అనుబంధం మార్గదర్శకాలు- 2023 అమలుపై జిల్లాస్థాయి కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నాగరాణి నిర్వహించారు.

నిర్దేశిత లక్ష్యాల సాధనకు కృషి చెయ్యాలి

నిర్దేశిత లక్షాల సాధనకు అధికారులు మరింత కృషి చేయాలని కలెక్టర్ నాగరాణి ఆదేశించారు. జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు, మునిసిపల్ కమిషనర్లతో వర్క్ ఫ్రంహోం, ఈకేవైసీ, ఆధార్ నమోదు, మన మిత్ర అంశాలపై గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా, గ్రామ, వార్డు సచివాలయ అధికారి వై.దోసిరెడ్డి, డీపీవో బి.అరుణశ్రీ పాల్గొన్నారు.

ఫోర్జరీ లీజు డాక్యుమెంట్లతో రుణాలు

ముదినేపల్లి మండలంలో సీబీఐ అధికారుల విచారణ

జాతీయ బ్యాంక్‌కు తాడేపల్లిగూడెం వాసి టోకరా 5

కాల్వల ఆధునికీకరణకు ప్రణాళిక సిద్ధం చెయ్యండి

ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మురళీకృష్ణంరాజు



సమావేశంలో మాట్లాడుతున్న మురళీకృష్ణంరాజు

భీమవరం టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): వేసవిలో కాల్వల ఆధునీకరణ పనులకు ప్రణాళిక సిద్ధం చెయ్యాలని డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కె మురళీ కృష్ణంరాజు అధికారులకు సూచించారు. ఇరిగేషన్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పంట, మురుగు కాల్వలకు ఎక్కడెక్కడ అభివృద్ధి చేయాలనే వివరాలు సేకరించి ప్రతిపాదనలు సిద్ధం చెయ్యాలన్నారు. కాల్వల లోపలి మరమ్మతులు కూడా గుర్తించాలన్నారు. గడచిన ఐదేళ్లలో అభివృద్ధి లేకపోవడంతో అనేక చోట్ల కాల్వలు సమస్యగానే ఉన్నాయన్నారు. ఇరిగేషన్, డ్రెయినేజీ అధికారులు వివరాలు తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్ జి.మాత్రరాజు, ఇరిగేషన్ ఎస్ఈ పి.నాగార్జున, ఈఈ సుబ్రహ్మణేశ్వరరావు, డ్రెయినేజీ ఈఈ సత్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.



వైభవంగా వేంకటేశ్వర స్వామి రథోత్సవం

భీమవరం టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : గోవింద .. గోవింద .. అంటూ గోవింద నామ స్మరణతో శ్రీవారి రథోత్సవం వైభవంగా ముందుకు సాగింది. శుక్రవారం రాత్రి భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీలోని వేంకటేశ్వర స్వామివారి 14వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవం నిర్వహించారు. అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు, కమిటీ సభ్యులు రథోత్సవాన్ని ప్రారంభించారు. అర్చకులు శ్రీనివాస చార్యులు శ్రీవారి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం శ్రీవారి ఆలయం నుంచి కాలనీలోని ప్రధాన వీధుల్లో రథోత్సవం ముందుకు సాగింది. మందిర కార్యదర్శి కుక్కల బాల, రామారావు, జానపాటి మధు, పెన్నాడ శ్రీను, కడలి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పర్యాటకులకు షాక్

వేసవిలో భూతల స్వర్గం కశ్మీర్ టూర్‌కు పలువురు ప్లాన్

ఉగ్రవాదుల నరమేథంతో భయం

మనాలి, సిమ్లా ప్రాంతాలకు మార్పు

నరసాపురం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి)

నరసాపురంలో బులియన్ వ్యాపారం చేసే జైన్ కుటుంబాలు ఈ ఏడాది జనవరిలో కశ్మీర్ టూర్ వెళ్లారు. నాలుగు కుటుంబాలు పిల్లలతో కలిసి పది రోజుల పాటు ఎంజాయ్ చేశారు. అందమైన కశ్మీర్ సరస్సులో బోటు ప్రయాణంతో పాటు ప్రకృతి అందాలకు కేరాఫ్ అయిన పహల్గం, గుల్‌మార్గ్, సోన్‌మార్గ్ వంటి ప్రాంతాల్లో పర్యటించారు. వీరియాత్ర గురించి తెలుసుకున్న మరికొన్ని కుటుంబాలు ఈ వేసవిలో వెళ్లేందుకు రెడీ అయ్యాయి. టిక్కెట్లు కూడా బుక్ చేసుకున్నారు. కశ్మీర్, జమ్ము ప్రాంతాల్లో ట్రావెల్ ఏజెంట్ ద్వారా రూమ్‌లు కూడా బుక్ చేశారు. అయితే ఇటీవల టూరిస్టులపై ఉగ్రవాదులు జరిపిన నరమేథంతో ఒక్కసారి షాక్ తిన్నారు. కశ్మీర్ అందాలను చూడాలని ఆశపడ్డ వీరి కల ఒక్క సారిగా చెదిరినట్లయింది. దీంతో టూర్ ప్లాన్‌ను మనాలీ, సిమ్లా లకు మార్చుకున్నారు. తాము తిరిగి ఎంజాయ్ చేసిన ప్రాంతంలోనే ఉగ్రవాదులు కాల్పులు జరపడాన్ని అక్కడకు వెళ్లి వచ్చిన జైన్లు నమ్మలేకపోతున్నారు.

భీమవరానికి చెందిన ఓ బ్యాంకు ఉద్యోగి ఈ వేసవిలో పిల్లలతో కలిసి కశ్మీర్ వెళ్లేందుకు రెడీ అయ్యారు. అయితే పహల్గం కాల్పులతో ఒక్కసారిగా షాక్ తిన్న ఆ కుటుంబం టిక్కెట్లను రద్దు చేసుకుంది. జిల్లాలోని అన్ని పట్టణాల నుంచి ఈ సమ్మర్‌లో చాలా మంది జమ్ము, కశ్మీర్‌లో ఎంజాయ్ చేసేందుకు టూర్ ప్లాన్ చేసుకు న్నారు. మూడేళ్లుగా ఎటువంటి ఉగ్రవాద చర్యలు లేకపోవడంతో భూతల స్వర్గాన్ని కల్లారా చూసి ఆనందించాలని కలలు గన్నారు. అయితే వీరి ఆశలపై పహల్గం కాల్పులు నీళ్లు చల్లినట్లయింది.

కశ్మీర్ టూర్ అందరికీ ఒక కల

ప్రపంచంలో స్విజ్జర్లాండ్, కెనడా, పారిస్, కశ్మీర్ ప్రాంతాల్లోని ప్రకృతి అందాలను ఒక్కసారైనా చూడాలని ప్రతి టూరిస్ట్ కలలు కంటారు. భారతీయుడు కశ్మీర్ ఒక్కసారైనా చూడాలని ఆశిస్తాడు. అక్కడ ప్రసిద్ధిగాంచిన వైష్ణవీదేవి ఆలయం, కశ్మీర్ లేక్‌లో రాత్రి సమయాల్లో బోటులో తిరగాలని కలలు కంటారు. మంచు, పచ్చని చెట్లతో ప్రకృతి అందాలతో నిండుగా ఉండే పహల్గం, గురుమార్గ్, సోన్‌మార్గ్ ప్రాంతాలను కూడా చూసేందుకు ఇష్టపడుతుంటారు. అయితే 25 ఏళ్లుగా వశ్మీర్ ఉగ్రవాదులతో అల్లకల్లోలంగా ఉండటంతో టూరిస్టులకు వెళ్లే అవకాశం లేకుండా పోయింది. నాలుగేళ్ల నుంచి ఇక్కడ పరిస్థితులు మారాయి. ఉగ్రవాదుల కదలికలు లేకపోవడంతో జిల్లా నుంచి చాలామంది పర్యాటకులు కశ్మీర్‌ను సందర్శిస్తూ వస్తున్నారు. అయితే పహల్గం కాల్పులతో ఇప్పట్లో అక్కడ పరిస్థితులు చక్కబడేలా కనిపించడం లేదు.



కశ్మీర్‌లో అందమైన పహల్గాంలో నరసాపురం వాసుల పర్యటన

వినగానే షాక్‌కు గురయ్యా



టూరిస్టులపై టెర్రరిస్టుల కాల్పుల్లో 26 మంది మృతి చెందారన్న వార్త వినగానే షాక్‌కు గురయ్యాను. మేము వెళ్లినపుడు అక్కడి ప్రజలు చాలా విషయాలు మాతో షేర్ చేసుకున్నారు.. 30 ఏళ్ల క్రితం నాటి పరిస్థితులు మళ్లీ వచ్చాయి.. టూరిస్టులు రాకతో మాకు ఉపాధి పెరిగింది. రాత్రి 11 గంటల వరకు బయట తిరగగలుగుతున్నామని చెప్పారు.. ఈ విషయాలన్నీ మా బంధువులు, స్నేహితులతో షేర్ చేసుకున్నాం.. దీంతో కొంతమంది అక్కడకు వెళ్లేందుకు టూర్ ప్లాన్ చేసుకున్నారు.. ఈ లోపు అక్కడ ఉగ్రవాద దాడులు జరగడం బాధాకరం..

\- రాజేంద్రకుమార్ జైన్, నరసాపురం





వల్లూరు పల్లి మందేశ్వరస్వామి ఆలయం .. మందేశ్వరస్వామి

మహిమాన్వితుడు మందేశ్వరుడు

రాష్ట్రంలోనే రెండో శనీశ్వరాలయంగా ప్రసిద్ధి

వల్లూరుపల్లి మందేశ్వర స్వామి ఆలయం

1.70 కోట్లతో పునర్నిర్మాణం


పెంటపాడు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోనే రెండవ ప్రసిద్ధ శనీశ్వర ఆలయంగా పెంటపాడు మండలం వల్లూరు పల్లి గ్రామంలోని బాలా త్రిపురసుందరి సమేత మందేశ్వర స్వామి ఆలయం పేరు గాంచింది. ఈ ఆలయానికి 120 సంవత్సరాల చరిత్ర ఉంది. శనివారం, శని త్రయోదశి రోజుల్లో భక్తులు తమ దోషాల పరిహారం కోసం అలయానికి అధిక సంఖ్యలో వస్తుంటారు.. నేడు శని త్రయోదశి పురస్కరించుకుని ఆలయ ప్రాసశ్యంపై కథనం...

ఈ ఆలయాన్ని 1904వ సంవత్సరంలో నిర్మాణం చేసారు. వల్లూరుపల్లి గ్రామం మొదట అగ్రహారంగా ఉండేది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పెరవలి మండలం కాకరపర్రు గ్రామానికి చెందిన అణివిళ్ళ సుందరరామశాస్త్రి ఈ గ్రామానికి వచ్చినప్పుడు ఈ ప్రాంతంలో శివాలయం నిర్మించాలని తలచారు. 1890లో ఆలయ నిర్మాణ పనులు ప్రారంభించగా 1904లో పూర్తయింది. ఆలయ పనులు నిర్మాణ దశలో ఉ ండగా వల్లూరుపల్లి గ్రామానికి చెందిన వేమూరి సీతారామ శాస్త్రి తమ పొలంలో పనిచేస్తున్నప్పుడు భూమి నుంచి మందేశ్వరుని విగ్రహం కనిపించింది. అయితే అదే రోజు రాత్రి స్వామి ఆయన కలలో కనిపించి తనకు కూడా గ్రామంలో శివాలయం నిర్మాణం చేయాలని స్వామి ఆదేశించారు. తొలుత రాజేశ్వరి సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలోనే పక్కన బాలా త్రిపుర సుందరి సమేత మందేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మాణం చేశారు. అప్పటి నుంచి ప్రజలు తమ శనిదోష పరిహారం కోసం ఈ ఆలయానికి వచ్చి పూజలు చేసుకుంటున్నారు.

1.70 కోట్లతో ఆలయ పునర్నిర్మాణం

ఆలయం నిర్మాణం చేసి 120 సంవత్సరాలు అయిపోవడంతో 1.70 కోట్లతో ఇటీవల ఆలయాన్ని పునర్నిర్మాణం చేశారు. శనీశ్వర ఆలయాలు రాష్ట్రంలో రెండే ఉన్నాయి. ఒకటి తూర్పు గోదావరి జిల్లా మందపల్లిలో ఉండగా, మరొకటి వల్లూరుపల్లి గ్రామంలో ఉంది. శనిత్రయోదశి రోజులలో దేవాలయానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారు. భక్తులు స్నానమాచరించేందుకు దేవాలయం సమీపంలోనే కాలువ ఉంది. మహిళలు స్నానమాచరించి వస్త్రాలు మార్చుకునేందుకు కాలువ సమీపంలో గదులు నిర్మాణం చేయాలని భక్తులు కోరుతున్నారు. వల్లూరుపల్లి ఆలయానికి వెళ్లాలంటే తాడేపల్లిగూడెం నుంచి పెంటపాడు, దర్శిపర్రు మీదుగా చేరుకోవచ్చు. అలాగే తణుకు తదితర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు తణుకు, అలంపురం, రాచర్ల, మీదుగా చేరుకోవచ్చు.

పూర్వీకుల నుంచి స్వామి సేవలోనే..





పూర్వీకుల నుంచి ఈ ఆలయంలోనే స్వామి సేవ చేస్తున్నాం. మాది మూడో తరం. గతంలో మా గ్రామం అగ్రహారంగా ఉండేది. ఈ ఆలయానికి వస్తే విశ్వేశ్వరస్వామి, మందేశ్వర స్వామి, సుబ్రహ్మణ్యేశ్వ స్వామి వార్లను ఒకే సారి దర్శించుకోవచ్చు. భక్తులు తమ దోషనివారణ కోసం నువ్వుల నూనెతో అభిషేకం చేస్తే చాలా మంచిది. శనివారం, శని త్రయోదశిలో పూజలు మంచి ఫలితం ఇస్తాయి.

\- పూజ్యం గంగాధరశర్మ, సత్యనారాయణ శర్మ, ఆలయ అర్చకులు





శ్రీచక్రవార్యుత్సవంలో స్వామి, అమ్మవార్లు, శ్రీచక్రపెరుమాళ్లు.. ధ్వజ అవరోహణ చేస్తున్న అర్చకులు

నయనానందకరం.. శ్రీచక్రవార్యుత్సవం

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసుని దివ్య కల్యాణోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం లక్ష్మీపురంలోని ఆలయంలో జరిగిన శ్రీచక్రవార్యుత్సవం భక్తులకు నేత్రపర్వమైంది. ఆలయ అర్చకులు, పండితుల వేద మంత్రోచ్చరణల నడుమ ఈ వేడుకను జరిపారు. పండితులు తమ శిరస్సులపై శ్రీచక్ర పెరుమాళ్లను ఉంచుకుని చక్రస్నానాన్ని నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు స్నపనం, చూర్ణోత్సవం, వసంతోత్సవం కన్నుల పండువగా జరిపారు. ఆలయ ఆవరణలో స్వామి, అమ్మవార్లతో పాటు శ్రీచక్ర పెరు మాళ్లను ఒక వేదికపై ఉంచి అభిషే కించారు. పాలు, పెరుగు, నీరు, తేనె, కొబ్బరి నీటితో వేద మంత్రాల నడుమ అభిషేకించారు. అనంతరం మూర్తులకు హారతులు సమర్పించారు. ఆలయ యాగశాలలో మహా పూర్ణాహుతి నిర్వహించారు. రాత్రి ధ్వజావ రోహణ చేశారు.





గో సంరక్షణశాలలో షవర్ నీటితో సేదతీరుతున్న గోవులు, అశ్వం, గజలక్ష్మి



ఏమి హాయిలే ఇలా..

షవర్ బాత్‌ల వద్ద సేద తీరుతున్న మూగజీవాలు



ద్వారకాతిరుమల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): భానుడి భగభగలకు అటు భక్తులతో పాటు ఇటు దేవస్థానం సంరక్షణలో ఉన్న మూగజీవులు సైతం అల్లాడుతున్నాయి. శేషాచలంపై ఎండలకు విలవిల్లాడుతున్న గజ,అశ్వ, పశుపక్ష్యాదులు వేసవి తాపాన్ని తట్టుకునేలా కొండపై ఏర్పాటు చేసిన షవర్ బాత్‌ల వద్ద జలకాలాడుతూ రిలాక్స్ అవుతున్నాయి. గోసంరక్షణ శాలలో ఉన్న వందలాది గోవులను, గజ, అశ్వశాలలో ఉన్న ఏనుగును, గుర్రాలను, ఎండవేడిమి నుంచి కాపాడే చర్యల్లో భాగంగా దేవస్థానం షవర్ బాత్‌లను ఏర్పాటు చేసింది. అలాగే ఖజానా బాతులకు రక్షణగా నీటి కొలను ఏర్పాటు చేశారు. శేషాచలంపై ఉన్న గోసంరక్షణశాలలో 320 పైబడి వివిధ జాతుల ఆవులు. గిత్తలు, దూడలు ఉన్నాయి. అలాగే ఆలయ గజలక్ష్మి(ఏనుగు), అశ్వాలను సైతం శ్రీవారి సేవలకు గాను పోషిస్తున్నారు. ఎండవేడిమి నుండి వీటిని కాపాడేందుకు అవి నివసించే షెడ్ల పైన రాజమండ్రి సమీపంలోని కడియం నర్సరీల నుంచి తెచ్చిన ఎలిఫెంట్ క్రీపర్ పాదులను పెంచుతున్నారు. అలాగే షెడ్లలోపల భాగంలో కూల్ పెయింట్ వేసి, ఫ్యాన్‌లను ఏర్పాటు చేశారు.



నా శత్రువు నాటికలోని ఒక సన్నివేశం

అలరించిన నాటికలు

రెండోరోజు చైతన్య భారతి నాటిక పోటీలు

భీమవరం అర్బన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): చైతన్య భారతి సంగీత నృత్య నాటక పరిషత్ ఆధ్వర్యంలో భీమవరం డీఎన్ఆర్ కళాశాల గన్నాబత్తుల క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న 18వ జాతీయ స్థాయి సాంఘిక నాటికోత్సవాల్లో రెండో రోజు శుక్రవారం రాత్రి 3 నాటికలు ప్రదర్శించారు. ముందుగా దుగ్గిరాల సోమేశ్వరరావు, కొత్తపల్లి శివరామరాజు సాంఘిక నాటిక పోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి డాక్టర్ పీఆర్‌కే వర్మ, డాక్టర్ ముదునూరి గోపాలకృష్ణంరాజు, డాక్టర్ వేగేశ్న రవికుమార్ రాజు ప్రారంభించారు. నాటక పరిషత్ అధ్యక్షులు రాయప్రోలో భగవాన్, కార్యదర్శి మంతెన రామ్‌కుమార్ రాజు, రాయప్రోలు శ్రీనివాసమూర్తి, భట్టిప్రోలు శ్రీనివాస్, పేరిచర్ల లక్ష్మణవర్మ, బోండా రాంబాబు, పెన్నాడ శ్రీను పోటీలను పర్యవేక్షించారు..

దూరమవుతున్న మానవ సంబంధాలపై 'నా శత్రువు'

టెక్నాలజీని అవసరానికి మాత్రమే వాడితే దానికి మించిన మంచి మిత్రుడు మరొకరు ఉండరు. అవసరం ఉన్నా, లేకున్నా, ఏదిబడితే అది చూస్తు వెళితే మాత్రం జీవితం ఉహించని ప్రమాదాలు సంభవిస్తాయని తెలియజెప్పిన నాటిక యువభేరి థియేటర్ ఆర్గనైజేషన్ , హైదరాబాదు వారి నా శత్రువు నాటిక. ఇందులో పాత్రదారులుగా సత్యనారాయణ, సేనయన, యస్మిత, యస్ జ్యోతి నటించారు. ఈ నాటిక రచన అక్కల తామేశ్వరయ్య, దర్శకత్వం వడ్డాది సత్యనారాయణలు వహించగా నటినటులు తమ నటనతో నాటికను మరింత రసరమ్యంగా ముందుకు తీసుకువెళ్ళి అలరించారు.

కార్పొరేట్ డాక్టర్ల తీరును చెప్పిన 'చిగురు మేఘం'

కార్పొరేట్ ఆసుపత్రిలో డబ్బు సంపాదనే ధ్యేయంగా ఉన్న డాక్టర్ల తీరును అమరావతి ఆర్ట్స్ గుంటూరు వారి చిగురు మేఘం నాటిక తెలియజేసింది. బంధాలు మరిచి ఒక కార్పొరేట్ ఆస్పత్రి అధిపతి కూమర్తెను పెళ్ళాడి సంపాదనే ధ్యేయంగా ఉన్న డాక్టర్‌ని, పేదరికంలో ఉన్న తల్లీతండ్రి చాలా సంవత్సరాల తరువాత కనిపించి రోగగ్రస్తులై డాక్టర్ చేతిలో చనిపోవడంతో డాక్టర్‌గా తాను చేసిన తప్పుకు పశ్చాత్తాపపడి తన తల్లిదండ్రుల లాంటి వారు గ్రామాల్లో ఎన్నో జబ్బులతో ఇబ్బంది పడుతున్నారని తెలుసుకుని వారికి వైద్యం చేయడానికి డాక్టర్ గ్రామాలకు వెళ్ళిపోవడంతో నాటకం ముగుస్తుంది.నాటిక రచన సత్యనారాయణ, మూలకథ ధూపాటి తిరుమల్లేశ్వరరావు, నటీనటులుగా యేమూరి హరిబాబు, ఎన్ఎస్ఆర్‌పి ప్రసాద్, కె మస్తాన్‌రావు, కె.సరిత నాటికను రక్తి కటించారు.

మానవ సంబంధాల విలువ తెలియ జెప్పే 'మా ఇంట్లో మహాభారతం'

తన భర్త విచ్చలవిడిగా ఆస్తిని పాడుచేస్తున్నాడని గ్రహించిన భార్య తన తెలివి తేటలతో ఆస్తిని కాపాడుతూ భర్త పేరును నిలబెట్టిన కుటుంబ కథా సారాంశంతో సాగిన మద్దుకూరి ఆర్ట్ క్రియేషన్స్ చిలకలూరిపేట వారి మా ఇంట్లో మహాభారత నాటిక. రచన మద్దుకూరి రవీంద్రబాబు, దర్శకత్వం నడింపల్లి వెంకటేశ్వర రావు, పాత్రదారులు సాలూరి జ్యోతిరాణి, శ్రీహరిరావు, పిల్లి కోటేశ్వరరావు తమ హాస్యనటనతో ప్రేక్షకుల్ని నవ్వులతో ముంచారు.



సదస్సులో పాల్గొన్న కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ

నక్కపల్లిలో త్వరలో స్టీల్ ప్లాంట్

కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ

భీమవరంటౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో ఆర్సెలర్ మిట్టల్, నిప్పాన్ స్టీల్స్ సంయుక్తంగా ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు పనులు త్వరలో ప్రారంభం కానున్నాయని, దీనిలో సుమారు లక్షా 40 వేల కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టనున్నా రని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమ శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. ముంబయిలో జరుగుతున్న ఇండియా స్టీల్-2025 సదస్సులో భాగంగా రెండో రోజు శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం కేంద్ర సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ సహ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి రాష్ట్ర పరిశ్రమల మంత్రి టీజీ భారత్, రాష్ట్ర పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులు హాజరై సుదీర్ఘంగా పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ మాట్లాడుతూ ప్రధాని మోదీ, సీఎం నారా చంద్ర బాబు నాయుడు నేతృత్వంలో, గత 10 నెలల కాలంలో రాష్ట్రం భారీ పెట్టు బడులను ఆకర్షించిందన్నారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ అభివృద్ధి పనులు, అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో త్వరలో ప్రారంభమ వుతున్న కీలక స్టీల్ ప్రాజెక్టులతో భారత్ స్టీల్ రంగంలో ఆంధ్రప్రదేశ్ ప్రాముఖ్యత పెరు గుతుందన్నారు.

బాలల భవిత బందీ



శనివారపు పేటలో ప్రభుత్వ బాలుర గృహం

ఏలూరు క్రైం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : అనాధలు.. తల్లిదండ్రుల ఆదరణలేని బాలలు.. తెలిసీ తెలియని వయసులో చెడు వ్యసనాలకు బానిసలు అవుతున్నారు. తల్లిదండ్రుల మాట వినకుండా మొండికేస్తున్నారు. కొంతమంది బాల నేరస్తులుగా మారిపోతున్నారు. ఇలాంటి వారందరినీ ఏలూరు శనివారపు పేటలో ఉన్న ప్రభుత్వ జువైనల్ హోమ్‌కు చేర్చి వారికి విద్యా బుద్ధులు నేర్పించి వారిలో సత్ప్రవర్తన వచ్చేలా చేసి మంచి పౌరులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నది.. వసతి గృహం, స్కూల్ అయితే ఉంది గానీ విద్యా బుద్ధులు చెప్పేవారే లేరు.. దీంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు.

ప్రస్తుతం 60 మంది బాలలు

చట్టాలపై అవగాహన కల్పించి బాలలను సన్మార్గంలో నడిపించడంలో వైఫల్యాల కారణంగా బాలలు ఇంకా చెడు వ్యసనాలకు బానిసలవుతున్నారు. క్షణికావేశంలో కొంతమంది ఇల్లు వదిలి వెళ్ళిపోతున్నారు. మరికొంత మంది చదువు వదిలివేసి బాల కార్మికులుగా మారిపోతున్నారు. జిల్లాలో వివిధ శాఖల అధికారులు స్పెషల్ డ్రైవ్‌లను నిర్వహిస్తూ ఇలాంటి వారిని గుర్తించి ఏలూరు శనివారపుపేటలో ఉన్న ప్రభుత్వ జువైనల్ హోమ్‌కు తరలిస్తున్నారు. తల్లి కాని తండ్రి కాని మరణించి ఆ కుటుంబంలో ఆర్థిక పరిస్థితులు ఇబ్బందిగా ఉండి మాట వినని బాలలను కూడా ఈ వసతి గృహంలో ఉంచుతున్నారు. ఏలూరు శనివారపుపేటలో ఉన్న ప్రభుత్వ బాలుర

తెలిసీ తెలియని వయసులో చెడు వ్యసనాలకు బానిసలు

సన్మార్గంలో నడిపించడానికి ఏలూరులో వసతి గృహం

ఉపాధ్యాయులు లేక విద్యకు దూరం

వసతి గృహానికి ఉమ్మడి గుంటూరు జిల్లా, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా, ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలో ఉన్న బాలలను తీసుకువచ్చి ఈ వసతి గృహంలో ఉంచుతున్నారు. రాష్ట్రంలో ఇలాంటి ప్రభుత్వ వసతి గృహాలు విశాఖపట్టణం, ఏలూరు (శనివారపుపేట), కడప, తిరుపతి ప్రాంతాల్లో మాత్రమే ఉన్నాయి. రైల్వేస్టేషన్లలో, బస్టాండ్లలో తిరిగే బాలలు, తల్లిదండ్రుల మాట విననివారిని ఇక్కడకు తీసుకువచ్చి ఉంచుతున్నారు. ప్రస్తుతం 60 మంది బాలలు ఉన్నారు. చదువుకోసం గతంలో వీరిని శనివారపుపేట జిల్లా పరిషత్ హైస్కూలుకు పంపించేవారు. అయితే అక్కడికి వెళ్లిన బాలలు తిరిగి వచ్చేటప్పుడు, వెళ్ళేటప్పుడు అదృశ్యం కావడంతో చివరకు ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంతో ఆ వసతి గృహంలో హైస్కూలు ఏర్పాటుకు అనుమతించి గుర్తింపు కూడా ఇచ్చారు. కొంత కాలం పాటు ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై ఇక్కడకు పంపించినా ఈ ఏడాది విద్యాశాఖ అధికారులు పంపించకపోవడంతో ప్రస్తుతం అక్కడ అంతంత మాత్రంగానే చదువు కొనసాగుతోంది.

విద్యాబుద్ధులు నేర్పేవారు కరువు

ప్రాథమిక స్కూలు వరకూ 29 మంది విద్యార్థులు ఉండగా ఇద్దరు టీచర్లను ప్రభుత్వం డిప్యూటేషన్లపై పంపించింది. హైస్కూలుకు మాత్రం ఒక్క టీచరును కూడా పంపలేదు. కొంతమంది స్వచ్ఛందంగా వెళ్లి వారికి ఖాళీ ఉన్న సమయంలో విద్యా బోధన చేస్తున్నారు. 33 మంది విద్యార్థులు ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకూ ఉన్నారు. ఈ ఏడాది ఏడుగురు విద్యార్థులు పదో తరగతి పరీక్షలను రాశారు.విద్యార్థులకు తెలుగు భాష నేర్పించడానికి ఒక రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మాతృదేవోభవ సంస్థ ఆధ్వర్యంలో అక్షర జ్ఞానం అనే పుస్తకాన్ని అక్షరాల నుంచి పదాలు వాక్యాలు వరకూ తయారు చేసి ఆ సంస్థలో ఉన్న వలంటీర్లు వచ్చి నేర్పిస్తున్నారు. సత్ప్రవర్తన కోసం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఆదేశాలతో ఒక సైకాలజిస్టు వచ్చి అవగాహన కల్పిస్తున్నారు. సామాజిక బాధ్యతలో భాగంగా ఓఎన్‌జీసీ పీఈటీని ఏర్పాటు చేశారు. అంతే కాకుండా షటిల్, చెస్ వంటి వాటిని నేర్పించడానికి ఆ సంస్థే స్పాన్సర్‌గా నిలుస్తుంది. ఇప్పటికైనా ప్రభుత్వం ఇక్కడ బాలలను సంరక్షణ చేయడానికి ఉపాధ్యాయులను నియమించి బాలలను సత్ప్రవర్తనలో తీసుకురావడానికి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

బాలా త్రిపురసుందరి అమ్మవారికి 250 గ్రాముల వెండి బహూకరణ

భీమవరం టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) మెంటేవారి తోటలోని శ్రీవిజయ కనకదుర్గ శ్రీచక్ర సహిత బాల త్రిపుర సుందరి అమ్మవారి వెండి పీఠానికి దాతల 250 గ్రాముల వెండిని విరాళంగా అందించారు. గురువారం పట్టణానికి చెందిన కూనపరెడ్డి హృషికేష్, పూర్ణకళ దంపతులు వెండిని ఆలయ ఆలయ అభివృద్ధి కమిటీకి అందించారు. ఆలయ అర్చకులు పూజలు చేసి దాతలకు అమ్మవారి చిత్రపటాన్ని అందించి సత్కరించారు. అమ్మవారి వెండి పీఠానికి



దాతలు ముందుకు వచ్చిన విరాళాలు అందిస్తున్నారని వారికి ఆలయ కమిటీ తరుపున కృతజ్ఞతలు తెలుతున్నామని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.

దాహం తీర్చుకునేందుకు కాకి ఒకటి భీమవరంలో ఇలా వాటర్ ట్యాప్‌ల వద్ద తెగ ట్రై చేసింది.. పాపం.. కానీ ఎంత ప్రయత్నించినా ఒక్క నీటి చుక్క కూడా రాలేదు..

- ఫొటోగ్రాఫర్, భీమవరం


హమ్మయ్య..దాహం తీర్చుకుందాం..


నీటి చుక్క రాదే..


ఇంకోసారి గట్టిగా ట్రై చేద్దాం..


అబ్బా.. లాభం లేదు..

ఎంఈవోల ద్వారా టీచర్లకు కొత్త మెడికల్ సర్టిఫికెట్లు జారీకి ఏర్పాట్లు

హాజరు కానివారికోసం నేడూ మెడికల్ చెకప్ క్యాంపు : డీఈవో

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : సాధారణ బదిలీల్లో ప్రత్యేక అర్హతా పాయింట్ల కోసం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని హెచ్‌ఎంలు, టీచర్లకు ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో రెండురోజులుగా కొనసాగుతున్న మెడికల్ చెకప్ క్యాంపులో భాగంగా శుక్రవారం పశ్చిమగోదావరి జిల్లాలోని మండలాల ఉపాధ్యాయులకు మెడికల్ అసెస్‌మెంట్ క్యాంపు జరిగింది. క్యాంపును కాకినాడ ఆర్జేడీ నాగమణి, డీఈవో వెంకటలక్ష్మమ్మ పరిశీలించారు. సాయంత్రం వరకు మొత్తం 190 మందికిపైగా హెచ్‌ఎంలు, ఉపాధ్యాయుల పాత మెడికల్ సర్టిఫికెట్లను, ఆరోగ్య రికార్డులను వైద్య నిపుణుల బృందాలు పరిశీలించాయి. రెండురోజుల పాటు నిర్వహించిన మెడికల్ చెకప్ క్యాంపునకు హాజరు కాలేని హెచ్‌ఎంలు, టీచర్లకోసం శనివారం కూడా క్యాంపు కొనసాగుతుందని, ఏదైనా కారణంతో హాజరు కాలేక పోయినవారంతా చివరిరోజు హాజరు కావచ్చునని డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. త్వరలో నిర్వహించనున్న బదిలీల్లో ప్రిఫరెన్షియల్ కేటగిరీ/స్పెషల్ పాయింట్లు పొందాలనుకునేవారంతా ఇపుడు నిర్వహిస్తోన్న మెడికల్ చెకప్ క్యాంపునకు హాజరై నమోదు చేయించుకుని మెడికల్ బోర్డు అసెస్‌మెంట్ అనంతరం జారీచేసే కొత్త సర్టిఫికెట్లను మాత్రమే బదిలీల కౌన్సెలింగ్‌కు పరిగణనలోకి తీసు కుంటామని, క్యాంపునకు హాజరుకాకుండా నేరుగా తీసుకునే మెడికల్ సర్టిఫికెట్లను అనుమతించబోమని స్పష్టం చేశారు. కాకినాడ ఆర్జేడీ మాట్లాడుతూ మూడు రోజులపాటు నిర్వహించిన మెడికల్ చెకప్ క్యాంపునకు హాజరైన హెచ్‌ఎంలు, ఉపాధ్యాయు లందరికీ కొత్త మెడికల్ సర్టిఫికెట్లను రాగల మూడు రోజుల్లో సంబంధిత మండల విద్యాధికారుల ద్వారా జిల్లా విద్యా శాఖ అందజేసేందుకు ఏర్పాట్లు చేసిందని వివరించారు. కొత్త సర్టిఫికెట్లను తీసుకునేందుకు మళ్లీ సర్వజన ఆసుపత్రికి రానవసరం లేదని డీఈవో స్పష్టం చేశారు.

అడ్డగోలు తవ్వకాలు


నడిపూడి ర్యాంపులో యంత్రాలతో ఇసుక తవ్వుతున్న దృశ్యం

నాలుగు ర్యాంపులలో ఇసుక అక్రమ తవ్వకాలు

లారీ రూ.5 వేలు వసూళ్లు

నిషేధం ఉన్నా సీఆర్‌జడ్ పరిధిలో ఆగని దోపిడీ

చోద్యం చూస్తున్న అధికారులు

రూ.కోట్లలో ఇసుక దందా

పాలకొల్లు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి) : ఇసుక అక్రమ తవ్వకాలకు అడ్డు అదుపు లేకుండా పోయింది. ఆచంట నియోజకవర్గ పరిధిలోని నడిపూడి, కోడేరు, భీమలాపురం కరుగోరుమిల్లి, ర్యాంపులలో ఇసుక, బొండు, మట్టి అడ్డగోలుగా తవ్వేస్తున్నారు. సీఆర్‌జడ్ పరిధిలో ఇసుక మట్టి తవ్వకాల్లో నిషేధం ఉన్నప్పటికీ యథేచ్ఛగా యంత్రాలతో తవ్వేస్తున్నారు. నడిపూడి ర్యాంపులో రోజుకు సుమారు 150 లారీలు ఎగుమతి అవ్వుతుండగా కోడేరు, భీమలాపురం కరుగోరు మిల్లి ర్యాంపులతో మరో 150 లారీలు ఇసుక, బొండు, మట్టిని తరలించేస్తున్నారు. మొత్తంగా రోజుకి 300 లారీలకు పైబడి అక్రమ ఎగుమతులు జరుగుతున్నాయి. నిషేధం ఉన్న ప్రాంతాలలో అక్రమంగా తవ్వేస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు నిద్రావస్థలో ఉండటంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రోజుకు రూ.10 నుంచి 15 లక్షలు అక్రమ వసూళ్లకు పాల్పడుతుండగా నెలకు సుమారు రూ.12 కోట్లు అక్రమార్జన ఎవరి జేబుల్లోకి వెళ్తున్నాయనే దానిపై సర్వత్రా చర్చలు జరుగుతున్నాయి. అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు అండదండలతోనే ఈ దండా కొనసాగుతుందని వ్యాఖ్యానిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉచిత ఇసుక పాలసీ అమలులోకి తెచ్చారు. ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు, నేరుగా ర్యాంపుల్లోకి, నదీ పాయల్లోకి వెళ్లి ఇసుక ఉచితంగా తెచ్చుకునే వెసులుబాటు కల్పించగా లారీలకు నిర్ధేశిత రుసుం నిర్ణయించారు అయితే ఇప్పుడు నిబంధనలను బేఖాతరు చేస్తూ నాలుగు ర్యాంపులలోనూ 5 యూనిట్లు ఇసుక రూ.5 వేలు, బొండు ఇసుక రూ.3500, మట్టికి రూ.4 వేలు వసూల్లు చేస్తున్నారు. అధకార పార్టీలోని కొందరు నాయకులు ప్రజా ప్రతినిధులు వ్యవహరిస్తున్న తీరుపై కూటమి శ్రేణుల్లోనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులను ప్రలోభ పెట్టి అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్నరనే విమర్శలు బాహాటంగా వినిపిస్తున్నాయి. ఇసుక వ్యవహారంలో ఇప్పటికే కూటమి ప్రభుత్వానికి కొంత మేర నష్టం కల్గింది. ఇప్పుడు జగన్‌రెడ్డి పాలన మించి జరుగుతున్న ఇసుక దందా ఇలానే ఉంటే రాష్ట్ర ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని కూటమిలోని నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు. జిల్లాలో వాస్తవంగా ఇసుక వినియోగం తగ్గింది. నవ్యాంధ్ర ఏర్పడిన తొలినాళ్లలో పాత పశ్చిమ గోదావరి జిల్లాలో రోజుకి వెయ్యి లారీలకు తగ్గకుండా ఇసుక సేకరించేవారు. ఇప్పుడు వినియోగం రోజుకి 300 లారీలకు పడిపోయింది. అయినప్పటికీ ఇసుక అక్రమ అమ్మకాలు అధిక ధర వసూల్లు తగ్గలేదు. రాష్ట్ర స్థాయి అధికారులు ఇసుక అక్రమ తవ్వకాలు అమ్మకాలపై దృష్టి సాధించకుంటే కూటమి ప్రభుత్వం అప్రతిష్ట పాలవుతుందని పలువురు హెచ్చరిస్తున్నారు.

పగలు ఈస్ట్ ..రాత్రి వెస్ట్ సరిహద్దుల్లో తవ్వకాలు

ఆచంట,ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఆచంట మండలం లంకగ్రామాల్లో ఇటీవల ఇసుక, మట్టి తవ్వకాలు మరలా మొదలయ్యాయి. తవ్వకాలకు పర్మిషన్ వచ్చిందంటూ కోనసీమ జిల్లాకు చెందిన కొంత మంది ర్యాంప్ వేసి మట్టి, ఇసుక తవ్వకాలు మొదలెట్టారు. అయితే పగలు కోనసీమ జిల్లా సరిహద్దు ప్రాంతంలో తవ్వకాలు జరిపి రాత్రి వేళల్లో వెస్ట్ సమీప ప్రాంతాల్లో అక్రమంగా ఈ తవ్వకాలు జరుపుతున్నట్లు సమాచారం. ఈ దందా గత కొన్ని రోజులుగా పెదమల్లం ఆనగారలంకలో జరుగుతున్నట్లు సమాచారం. ఈ అక్రమ తవ్వకాల్లో కోనసీమ జిల్లాకు చెందిన కొంత మంది ఈ దందాకు పాల్పడుతున్నారని చెబుతున్నారు. ప్రతీరోజూ సుమారు 30 నుంచి 50 లారీలకు పైగానే అక్రమంగా ఇసుక, మట్టి తరలిపోతున్నట్లు సమాచారం. గప్ చిప్‌గా ఈ వ్యవహారం జరుగుతున్నా అధికారులు పట్టించుకోలేదని విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. పెదమల్లం లంకలో జరుగుతున్న అక్రమ ఇసుక, మట్టి తవ్వకాలుపై తహసీల్దార్ జి.కనకరాజును వివరణ కోరగా దీనికి సంబంధించి సిబ్బంది సరిహద్దు ప్రాంతానికి పంపించడం జరిగిందని అయితే కోనసీమ జిల్లా నాగుళ్ళంక సరిహద్దులో మాన్యువల్‌గా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారని ఈ తవ్వకాలు కోనసీమ జిల్లా పరిధిలో జరుగుతున్నట్లు తెలిపారు. తవ్వకాలు జరుగుతున్న ప్రాంతం తమ పరిధి కాదన్నారు.


ఇసుక లోడుతో లంక గ్రామంలో టిప్పర్‌లు


ముదినేపల్లి మండలం చేవూరులో రైతులను విచారిస్తున్న సీబీఐ అధికారులు

ఫోర్జరీ లీజు డాక్యుమెంట్లతో రుణాలు

ముదినేపల్లి మండలంలో సీబీఐ అధికారుల విచారణ

తమకు తెలియదంటున్న రైతులు

జాతీయ బ్యాంక్‌కు తాడేపల్లిగూడెం వాసి టోకరా

ముదినేపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఫోర్జరీ సంతకాలతో ముదినేపల్లి మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతుల పేరున చేపల చెరువుల లీజు పేరిట తప్పుడు అగ్రిమెంట్లు సృష్టించి ఓ వ్యక్తి బ్యాంకు నుంచి కోట్లాది రూపాయల రుణాలను తీసుకున్న ఉదంతం వెలుగు చూసింది. వరి సాగులో ఉన్న భూములను సైతం చేపల చెరువులుగా చూపించి రుణాలు తీసుకోవడం గమనార్హం. 2015లో మండలంలోని పలు గ్రామాలకు చెందిన 188 రైతుల నుంచి చేపల చెరువుల తవ్వకానికి భూములను లీజుకు తీసుకుని రైతుల సంతకాలను ఫోర్జరీ చేసి పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంకు చెందిన ఎస్.కిరణ్ అనే వ్యక్తి భీమవరంలోని ఒక జాతీయ బ్యాంక్ నుంచి కోట్లాది రూపాయల రుణాలు తీసుకుని తిరిగి చెల్లించలేదు. బ్యాంక్ అధికారులు ఆరా తీయగా రుణాలు తీసుకోవ డంలో అక్రమాలు చోటు చేసుకున్నాయని తెలిసింది. దీనిపై ఆ బ్యాంక్ ఉన్నతాధికారులు విశాఖపట్నం సీబీఐ అధికారులకు ఫిర్యాదు చేయడంతో 2024 అక్టోబరులోనే సీబీఐ కేసు నమోదు చేసింది. ఈ విషయాలేవీ స్థానిక రైతులకు సీబీఐ అధికారులు విచారణకు వచ్చేవరకు తెలియక పోవడం గమనార్హం. ఈ కేసు విచారణలో భాగంగా గత రెండు రోజులుగా సీబీఐ అధికారులు ముదినేపల్లి మండలంలో బ్యాంకు డాక్యుమెంట్లపై సంతకాలున్న రైతులను విచారించారు. గురువారం గురజ, దేవరం, సింగరాయపాలెం, అల్లూరు, శుక్రవారం చేవూరు పరిధిలో విచారణ నిర్వహించారు. గురజలో చేపట్టిన విచారణలో 2020లో చేపలు చెరువులు తవ్వగా 2015లోనే చెరువులపై రుణాలు తీసుకున్నట్టుగా బయట పడింది. మీ భూమి పోర్టల్‌లో నమోదైన పలువురు భూ యజమానుల పేరున రుణాలు తీసుకున్నట్టు అధికారులు చెప్పగా,వారు సుమారు 30 ఏళ్ల క్రితమే మరణిం చారని రైతులు తెలిపారు. కొంతమంది విద్యా వంతులు సంతకాలకు బదులు వేలిముద్రలు వేసినట్టు, కొంతమంది నిశానిదారులు బాండ్లపై సంతకాలు చేసినట్టు గుర్తించారు. సింగరాయపాలెం ఏరియాలోని చేపల చెరువుల రైతులు కె.నాగబాబు, పి.నరసింహా రావు, సీహెచ్ సుబ్రహ్మణ్యం తదితరులు తమ పేరున భీమవరం బ్యాంక్‌లో రుణాలు తీసుకున్నట్టు తెలిసి అవాక్కయ్యారు. చేవూరులో శుక్రవారం సీబీఐ అధికారులు రైతులను విచారించగా, తాము రుణాలు తీసుకోలేదని, తమ సంతకాలు ఫోర్జరీ చేశారని వల్లభనేని వెంకట్రావుతో పాటు పలువురు రైతులు అధికారులకు తెలిపారు. వీఆర్వోల సమక్షంలో భూముల సర్వే నంబర్లను పరిశీలించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 188 మంది రైతులను విచారించి వివరాలు సేకరిస్తున్నామని, విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని విచారణాధికారులు తెలిపారు.

సహకారం ఎవరిది ?

పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన కిరణ్ అనే వ్యక్తి ముదినేపల్లి మండలంలోని రైతుల పేరున లీజు అగ్రిమెంట్లు సృష్టించడం వెనుక ఎవరి సహకారం ఉందనేది చర్చ నీయాంశంగా మారింది. ముదినేపల్లి ప్రాంతంలో అంతకుముందు చేపల చెరువులకు భూములు లీజుకు తీసుకున్న ఆ ప్రాంతానికి చెందిన లీజుదారులు ఎవరైనా సహకరించి ఉంటారని లేదా స్థానికులు ఎవరైనా సర్వే నంబర్లు చెప్పి ఉండవచ్చని భావిస్తున్నారు.

19 నుంచి ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ పరీక్షలు

అమరావతి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో పదోతరగతి, ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు మే 19 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు సొసైటీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. 24 వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొంది. పరీక్షా కేంద్రాలు కేటాయించాలని ప్రభుత్వ పరీక్షల విభాగానికి లేఖ రాసినట్టు తెలిపింది. మే 26 నుంచి 30 వరకు ఇంటర్ ప్రాక్టికల్స్ నిర్వహించనున్నట్టు పేర్కొంది.

బీచ్‌లో యువకుడిని కాపాడిన పోలీసులు



మొగల్తూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి):పేరుపాలెంలో అలల ఉధృతికి లోపలికి కొట్టుపోతున్న ఒక యువకుడిని తీరం వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసులు రక్షించారు. శుక్రవారం ద్వారకాతిరుమలకు చెందిన మోటార్‌సైకిల్ మెకానిక్ వీరవల్లి మధు అనే 17 సంవత్సరాల యువకుడు పేరుపాలెం సాగర తీరానికి వచ్చాడు. మధ్యాహ్నం సమయంలో సముద్ర స్నానం చేస్తూ అలల ఉధతికి గురై కొట్టుకుపోతున్నాడు. ఈవిషయాన్ని గమనించిన పోలీస్ కానిస్టేబుల్ పి.శ్రీనివాస్, హెచ్ జి.హరిలు ఆ యువకుడును కాపాడి ఒడ్డుకు తీసుకువచ్చారు. అప్పటికే ఎక్కువ నీరు తాగి అపస్మారక స్థితికి చేరుకున్న ఆ యువకుడుకి సపరియలు చేశారు. కాపాడిన పోలీసు సిబ్బందిని స్థానికులు, పర్యాటకులు అభినందించారు.

చైన్ స్నాచర్ అరెస్టు

భీమవరం క్రైం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నడిచి వెళ్తున్న మహిళ మెడలో బంగారు గొలుసును లాక్కుపోతున్న దొంగను స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించిన సంఘటన పట్టణంలో చోటుచేసుకున్నది. వన్‌టౌన్ ఎస్‌ఐ కృష్ణాజీ తెలిపిన వివరాల ప్రకారం.. మెంటేవారి తోటకు చెందిన జి.వాసవి అనే మహిళ తన సొంత దుకాణానికి వెళ్ళి సాయంత్రం సమయంలో ఇంటికి వెళ్తున్నారు. సరిగ్గా బుధవారం మార్కెట్ అండర్ టన్నెల్ వద్దకు వెళ్ళేసరికి పాలకొల్లుకు చెందిన కొప్పర్తి సూర్యపాల్ అనే యువకుడు వాసవి మెడలోని బంగారు గొలుసును లాగడానికి ప్రయత్నించాడు. అయితే ఆ సమయంలో ఆమె చైన్‌ను గట్టిగా పట్టుకోవడంతో సూత్రాలు ఆమె చేతిలో ఉండిపోయాయి. గొలుసు అతను లాక్కున్నాడు. ఆమె కేకలు వేసింది. దీంతో యువకుడు కత్తి చూపించి చంపేస్తానంటూ బెదిరించాడు. ఆమె కేకలు విన్న స్థానికులు అతనిని పట్టుకుని కత్తి లాక్కున్నారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. నిందితుడిని పోలీసులు కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్


నిందితుడిని అరెస్టు చేసి విలేకరులకు వివరాలు చెబుతున్న డీఎస్పీ రవిచంద్ర

దొంగను అరెస్టు చేసిన పోలీసులు

సుమారు రూ.25 లక్షల విలువైన చోరీ సొత్తు స్వాధీనం

జంగారెడ్డిగూడెం,ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటు పడి తాళం వేసి ఉన్న ఇళ్లను ఎంచుకుని పట్టపగలే చోరీలకు పాల్పడుతూ, మొదటి రెండు చోరీలలోనే ఇరవై లక్షల విలువైన బంగారం దోచుకెళ్ళిన ఇరవై ఒక్క ఏళ్ళ ఒంటెద్దు క్రాంతి కుమార్ ను మూడవకన్ను అతి సులభంగా పట్టించింది. జంగారెడ్డిగూడెం సర్కిల్ కార్యాలయంలో డీఎస్పీ యు.రవిచంద్ర శుక్రవారం రాత్రి విలేకరుల సమావేశంలో ఆ వివరాలు తెలియజేశారు. టి.నరసాపురం మండలం సింగరాయపాలెం గ్రామానికి చెందిన క్రాంతి కుమార్ వృత్తి రీత్యా ప్లంబర్. జంగారెడ్డిగూడెం పట్టణంలో ప్లంబింగ్ పనులు చేస్తుంటాడు. ఈ నెల 14వ తేదీ ఉదయం త్రివేణి కాలేజీ ఎదురుగా ఉన్న రోడ్డులో ఓ ఇంటికి తాళం వేసి ఉండడం చూసిన క్రాంతి కుమార్ గోడ దూకి లోపలికి వెళ్ళాడు. తనతో తెచ్చుకున్న ప్లంబింగ్ సామాన్ల సంచిలో తెచ్చుకున్న కట్టర్ మిషన్‌తో తాళం కట్ చేసి ఇంటి లోపలికి ప్రవేశించాడు. లోపల బెడ్ రూములో ఉన్న బీరువా తాళాలు కూడా తొలగించి అందులో ఉన్న డబ్బు, నగలు తస్కరించాడు. ఆ తర్వాత రోజు 15వ తేదీ ఉదయం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రి వెనుక డాంగే నగర్ సమీపంలో మరొక ఇంటికి తాళం వేసి ఉండటాన్ని చూసి ఆ ఇంటి గోడ దూకి మెయిన్ డోర్ మెస్‌డోర్‌ని స్క్రూ డ్రైవరుతో తొలగించి,మెయిన్ డోర్ లాకర్‌ను కటింగ్ మిషన్‌తో కట్ చేసి లోపలికి ప్రవేశించాడు. లోపల బీరువా తాళం తీసి అందులో ఉన్న బంగారు వస్తువులను తీసుకుని పారిపోయినట్లు డీఎస్పీ తెలిపారు. అప్పటికే పట్టణంలో అన్ని ప్రధాన వీధుల్లో సీసీ కెమేరాలను ఏర్పాటు చేయడంతో పోలీసు సిబ్బంది వాటిని జల్లెడ పట్టి నిందితుడిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి సుమారు రూ.20 లక్షల విలువైన 25 గ్రాముల చోరీ సొత్తు బంగారాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. అతనిపై షీటు ఓపెన్ చేసి అతని కదలికలు నిత్యం గమనిస్తూ ఉంటామ న్నారు. కేసును త్వరగా ఛేదించిన సీఐ కృష్ణబాబు, ఎస్సై ఎస్‌కె.జబీర్, ఏఎస్సై సంపత్ కుమార్, పీసీలు ఎన్.రమేష్,రాజశేఖర్‌లను డీఎస్పీ అభినందించారు.

సొసైటీ కార్యదర్శి ఆత్మహత్య

ఇరగవరం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ఇరగవరం మండలం కొత్తపాడు సొసైటీ కార్యదర్శి చల్లా వీర వెంకట సత్యసాయిబాబు ఉరి వేసుకుని శుక్రవారం ఉదయం ఆత్మహత్య చేసుకున్నాడు. పాలకొల్లు మండలం దగ్గులూరు గ్రామానికి చెందిన చల్లా వీర వెంకట సత్యసాయిబాబు 2015వ సంవత్సరం నుంచి ఇరగవరం మండల కొత్తపాడు సొసైటీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల సొసైటీ లావాదేవీలు ఆన్‌లైన్ ప్రక్రియ జరుగుతున్నది. ఈ ఆన్‌లైన్ ప్రక్రియను సొసైటీ కార్యాలయంలో కాకుండా ఇంటి వద్దే ల్యాప్‌టాప్‌లో నమోదు చేసేవారు. రెండు రోజులకొకసారి కార్యాలయానికి వచ్చి ఏమైనా సంతకాలు అవసరమైతే పెట్టి వెళ్ళిపోయేవారు. ఈయన ఆఖరుగా సోమవారం సొసైటీకి వచ్చి వెళ్ళిపోయినట్లు సిబ్బంది చెప్పారు. ఆ రోజు నుంచి అతని ఫోన్ పనిచేయడం లేదని ఆయనకు కావాలసిన సమయంలో మాత్రం ఫోన్ ఆన్‌చేసి మిగతా సమయంలో ఫోన్ స్విచ్‌ఆఫ్‌లో ఉండేదని కార్యాలయ సిబ్బంది తెలిపారు. సాయిబాబు కుటుంబ ఆర్థిక కారణాల వల్ల చనిపోయారా, సొసైటీ లావాదేవీలు కంప్యూటరైజేషన్ ఒత్తిడి కారణంగా చనిపోయారా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మృతికి ముందు సాయిబాబు రెండు లేఖలు రాసినట్లు తోటి సిబ్బంది చర్చించుకుంటున్నారు. ఈ లేఖ ఒకటి కార్యాలయ సిబ్బందికి, మరొకటి కుటుంబ సభ్యులకు రాసినట్లు సమాచారం. ఈ లేఖను కుటుంబ సభ్యులు గోప్యంగా ఉంచుతున్నారని సిబ్బంది చర్చించుకుంటున్నారు. సాయిబాబుకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం


డోలిపై మృతదేహాన్ని తరలిస్తున్న రెవెన్యూ సిబ్బంది, స్థానికులు

పెదబయలు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు పాడేరు జిల్లా పెదబయలు మండలం జామిగూడ పంచాయతీలో గల తారాబు జలపాతంలో గురువారం గల్లంతైన భీమడోలుకు చెందిన బీటెక్ విద్యార్థి గొన్నూరి కిశోర్ (22) మృతదేహం శుక్రవారం లభ్యమైంది. పెదబయలు ఎస్‌ఐ కొల్లి రమణ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పూర్ణయ్య ఆధ్వర్యంలో స్థానికులు శుక్రవారం ఉదయం నుంచి గాలింపు చేపట్టారు. జలపాతంలో రాళ్ల మధ్యలో ఇరుక్కున్న మృతదేహాన్ని అతి కష్టం మీద తాళ్ల సాయంతో స్థానికులు వెలికితీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ముంచంగిపుట్టు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. జిల్లా కలెక్టర్ చొరవతో అంబులెన్స్‌లో మృతదేహాన్ని తరలించారు. సంఘటన స్థలానికి చేరుకున్న కిశోర్ తల్లిదండ్రుల రోదన స్థానికులను కలచివేసింది.

మెడికల్ షాపుల్లో తనిఖీలు

నరసాపురం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మెడికల్ షాపుల్లో జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ మల్లిఖార్జున్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ముందుగా ఎంపిక చేసుకున్న దుకాణాల్లో ఆకస్మికంగా వెళ్లి షాపుల్లో వేర్వేరుగా తనిఖీలు చేశారు. వయాగ్రా , నిద్రమాత్రలతో పాటు మత్తు కలిగించే కొన్ని మందులపై ప్రభుత్వం నిఘా పెట్టింది. వైద్యుల చీటీ లేకుండా, రశీదులు లేకుండా వీటిని అమ్మకూడదు. అయితే కొందరు వ్యాపారులు అక్రమంగా తీసుకొచ్చి అమ్ముతున్నారన్న ఫిర్యాదులపై రాష్ట్ర ప్రభుత్వం షాపుల్లో తరుచూ తనిఖీలు చేయాలని ఆదేశించింది. దానిలో భాగంగా జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ మల్లిఖార్జున్‌తో పాటు ఏడీ చక్రవర్తి నేతృత్వంలో ఈ దాడులు చేశారు. అయితే దాడులు జరుగుతున్న విషయాన్ని తెలుసుకుని వీటిని విక్రయిస్తున్న షాపు యాజమానులు వెంటనే ఈ మందుల్ని బయటకు పంపేశారు. గతంలో ఇలాంటి దాడులు చేసినప్పుడు కూడా ఎవరిపై కేసులు నమోదు చేయలేదు.

చెల్లి మృతి తట్టుకోలేక..

పురుగు మందు తాగి అన్న మృతి

పెనుగొండ , ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి) : చెల్లెలి మరణం తట్టుకోలేక అన్నయ్య మృతి చెందినట్లు ఎస్‌ఐ కొప్పిశెట్టి గంగాధర్ తెలిపారు. పెనుగొండ మండలం సిద్ధాంతం గ్రామానికి చెందిన ఈడువిల్లి బాలలక్ష్మీనర్సింహ(21) ఏసీ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల అతని చెల్లెలు అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్ద ఉరి వేసుకుని మృతి చెందింది. ఆమె మృతిని తట్టుకోలేక అన్నయ్య ఈ నెల 12వ తేదీ తన ఇంటి వద్ద కలుపుమందు తాగేశాడు. దీంతో బంధువులు చికిత్స నిమిత్తం తణుకు ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేశారు.

గ్రీన్ ఫీల్డ్ హైవేపై లారీ బోల్తా: డ్రైవరు మృతి


ఘటనా స్థలం వద్ద ధనుంజయ్ సింగ్ మృతదేహం

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గ్రీన్ ఫీల్డ్ హైవే లారీ డ్రైవర్ ధనుంజయ్ సింగ్ (44) మృతి చెందాడు. లక్కవరం ఎస్సై శశాంక తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జార్కండ్ రాష్ట్రం పిప్రా గ్రామానికి చెందిన మృతుడు ధనుంజయ్ సింగ్ (44) గత కొంత కాలంగా మండలంలోని పుట్లగట్లగూడెం వద్ద ఏర్పాటు చేసిన గ్రీన్ ఫీల్డ్ హైవే స్టాక్ పాయింట్‌లో కాంక్రీట్ మిక్సర్ లారీ డ్రైవరుగా పనిచేస్తున్నాడు. గురువారం సాయంత్రం లారీలో కాంక్రీట్ తీసుకుని పంగిడిగూడెం వైపుకు వెళ్తున్నాడు. రహదారి మధ్యలో సాంకేతిక కారణాలతో లారీ నిలిచిపోయింది. దీంతో ధనుంజయ్ సింగ్ లారీను స్టార్ట్ చేయగానే లారీ వెనక్కి వెళ్ళి డివైడర్‌ను ఢీకొట్టి తిరగబడింది. ఈ ప్రమాదంలో ఘనుంజయ్ సింగ్ తలకు తీవ్రగాయాలై ఘటనా స్థలం వద్దనే మృతి చెందాడు. గ్రీన్ ఫీల్డ్ హైవే సంస్థ ఫీల్డ్ ఆఫీసర్ కిషోర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో కూలీ మృతి

ముసునూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): గోగులంపాడులో చిమట శివయ్య(30) శుక్రవారం స్థానిక రైతు పాలడుగు నాగేంద్రబాబుకు చెందిన పామాయిల్ తోటలో గెలలు కోసేందుకు కూలీకి వెళ్ళాడు. గెలలు కోసే క్రమంలో పామాయిల్ చెట్టు పైన ఉన్న 11కేవి విద్యుత్ లైన్‌కు ప్రమాదవశాత్తు కత్తి తగలడంతో అక్కడకక్కడే మృతి చెందాడు. ముసునూరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని శివయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఇల్లు దగ్ధం

ముసునూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెక్కపల్లి బీసీకాలనీలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో పేరం సుబ్బారావు ఇల్లు దగ్ధమైంది. సుబ్బారావు తన భార్యతో కలిసి కూలీ పనులకు వెళ్ళాడు. ఈ నేపథ్యంలో ఒక్కసారిగా ఇంటి నుంచి మంటలు రావడంతో చుట్టు పక్కలవారు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. ఈ సంఘటనలో ఇంటిలో ఉన్న వస్తువులు పూర్తిగా కాలిపోయి, సుబ్బారావు కుటుంబం కట్టుబట్టలతో మిగిలారు.

అవగాహనతోనే మలేరియా నిర్మూలన

గణపవరం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): శుక్రవారం సరిపల్లెలో పీఎంపీల అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా నివారణ దినం నిర్వహించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు ఏఆర్‌కే పరమేశ్వర్లు ముఖ్య అతిథిగా మాట్లాడుతూ మలేరియా మహమ్మారి నిర్మూలనకు ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. మండల పీఎంపీల అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సత్యనారాయణమూర్తి, కార్యదర్శి శివశ్రీనివాసరావు, కోశాధికారి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించకుంటే మేమే తొలగిస్తాం: తహసీల్దార్

గణపవరం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): గణపవరం మూడు రోడ్ల సెంటర్‌లో ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించకపోతే తాము తొలగిస్తామని తహసీల్దార్ అప్పారావు స్పష్టం చేశారు. గణపవరం ఎంపీడీఓ కార్యాలయ భవనంలో శుక్రవారం ఆక్రమణదారులు, వ్యాపారులతో జరిగిన సమీక్షా సమావేశంలో తహసీల్దార్ అప్పారావు ఈ మేరకు హెచ్చరించారు. ట్రాఫిక్ సమస్య నివారణకు ఆక్రమణలు తొలగిస్తున్నామని ఆయన తెలిపారు. ఎంపీడీఓ బేబి శ్రీలక్ష్మి, ఈఓపీఆర్‌డీ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



పట్టణంలో ర్యాలీ చేస్తున్న దృశ్యం

అద్దెలు తగ్గించకుంటే ఆత్మహత్యలే శరణ్యం

తాడేపల్లిగూడెం రూరల్ ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): అద్దె భారం భరించలేమంటూ చిరు వ్యాపారులు, మెకానిక్‌లు నిరసన తెలిపారు. ఏళ్ల తరబడి మున్సిపల్ షాపులను అద్దెకు తీసుకున్న జీవనం సాగిస్తున్న తాము అద్దె తగ్గించకపోతే సామూహిక ఆత్మహత్యలే శరణ్యం అంటూ తాడేపల్లిగూడెం పట్టణ మున్సిపల్ షాపులను అద్దెకు తీసుకున్న చిరు వ్యాపారులు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఏసుబాబుకు వినతిపత్రం అందించారు. అసలే వ్యాపారాలు లేక జీవనం ఇబ్బందిగా ఉందని, కనికరించి అద్దె తగ్గించాలని కోరారు.


మాట్లాడుతున్న జిల్లా సహకార అధికారి నాగరాజు

మహిళలు ఆర్థిక పురోగతి సాధించాలి

పాలకోడేరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా పురోగతి సాధించాలని జిల్లా సహకార అధికారి ఎన్.నాగరాజు కోరారు. అంతర్జాతీయ సహకార సంవత్సరం 2025ని పురస్కరించుకుని శుక్రవారం పాలకోడేరు మండల సమాఖ్య కార్యాలయంలో జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు పళ్ళెం అరుణ కుమారి అధ్యక్షతన జరిగిన జిల్లా సమాఖ్య సెమినార్‌లో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ జిల్లా సహకార సంఘం మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుందని, ఈ సహకార సంఘానికి అధ్యక్షులుగా జిల్లా కలెక్టర్ వ్యవహరిస్తారని అన్నారు. మహిళలకు ఆర్థిక వనరులు అందించే వ్యాపారాలు చేసుకొనుటకు అవసరమైన రుణాలు తమ సంస్థ ద్వారా అందించుటకు సిద్ధంగా ఉందని, ఈ అవకాశాన్ని గ్రామీణ మహిళలంతా ఉపయోగించుకోవాలని కోరారు. జిల్లా గ్రామీణాభివృద్ధి ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు పళ్ళెం అరుణకుమారి, రాష్ట్ర సహకార యూనియన్ విద్యాధికారి భోజ రంగరాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి ప్రజలు సహకరించాలి : బొలిశెట్టి

తాడేపల్లిగూడెం అర్బన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కావాలని అప్పుడే లక్ష్యాన్ని సాధించగలమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద విజన్ 2047పై మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు అధ్యక్షతన అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధికి ఏ శాఖకు ఎంత నిధులు కావాలనే విషయమై అధికారులతో చర్చించామన్నారు. జిల్లా కలెక్టర్ సహకారంతో నివేదిక పంపిస్తామన్నారు. ఆర్డీవో ఖతీబ్ కౌసర్ బనో, నోడల్ అధికారి ప్రభాకర్, తహసీల్దార్ సునీల్‌కుమార్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

ఆకివీడు రూరల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఆకివీడు యూనిట్ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైందని ఎన్నికల అధికారి కె. త్రినాథ్ తెలిపారు. ఆకివీడు యూనిట్ అధ్యక్షుడిగా ఎం. సుందర్‌సింగ్, ఉపాధ్యక్షుడిగా డీవీ మోహనరావు, కార్యదర్శిగా కె. శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా ఉష, ట్రెజరర్‌గా హేమారాణి, జిల్లా కౌన్సిలర్లుగా బులివెంకయ్య, ఏలియా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌రాజు, పరిశీలకులుగా సంతోష్, రామరాజు పాల్గొన్నారు.


మొగల్తూరు బస్టాండ్‌లో చలివేంద్రం ప్రారంభిస్తున్న సర్పంచ్

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

మొగల్తూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): దాతలు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని సర్పంచ్ పడవల మేరీ అన్నారు. శుక్రవారం గ్రామానికి చెందిన కూరగాయల వర్తకుడు ముక్కు నాగేశ్వరరావు తన తండ్రి ఆంజనేయులు స్మృత్యర్థం ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. నీటి సంఘ ఉపాధ్యక్షుడు ముక్కు పుల్లయ్య నాయుడు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు దొంగ రామారావు, వర్తక సంఘ నాయకులు పెంకే రామకృష్ణ, దూసనపూడి రాజు, ముక్కు గోపాలకృష్ణ, కాసాని చినబాబు, దేశంశెట్టి శ్రీను, ముక్కు గిరి తదితరులు పాల్గొన్నారు.

'సమాజ సేవలో నిరంతరం రోటరీ'

తణుకు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): సమాజ వికాసం కోసం రోటరీ నిరంతరం శ్రమిస్తుందని రోటరీ జిల్లా గవర్నర్ ఎన్. వెంకటేశ్వరరావు చెప్పారు. శుక్రవారం తణుకు రోటరీ క్లబ్‌ను అధికారికంగా సందర్శించిన ఆయన పలు సేవా కార్యక్రమాలను ప్రారంభించారు. తణుకు ప్రభుత్వ ఆసుపత్రిలోని డయాలసిస్ సెంటర్‌కు రూ. 10 వేలు విరాళాన్ని, 20 మంది రిక్షా కార్మికులకు బాడీ టాప్‌లను అందజేశారు. అంతకు ముందుగా రోటరీ ఆవరణలో గల రోటరీ ఫౌండర్స్ పాల్ హారీస్, డాక్టర్ ముళ్లపూడి హరిశ్చంద్రప్రసాద్‌ల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గుడ్డ సంచుల వాడకం నైతిక బాధ్యత

భీమవరంటౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించి గుడ్డ సంచులను వాడటం ప్రతిఒక్కరి నైతిక బాధ్యత అని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వరరావు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, భీమవరం పురపాలక సంఘం ఆధ్వర్యంలో భీమవరం వీరమ్మ పార్కు సెంటర్‌లో ప్లాస్టిక్ నిషేధ ప్రచార ర్యాలీ, ప్రతిజ్ఞ, ఉచితంగా గుడ్డ సంచులను పంపిణీ చేశారు. చెరుకువాడ రంగసాయి, విద్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ డైరెక్టర్ లక్ష్మి భవానీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నవ ధాన్యాల కిట్ల పంపిణీ

నరసాపురం రూరల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): నవరసపురంలో శుక్రవారం నవధాన్యాల కిట్‌లను రైతులకు జిల్లా వ్యవసాయశాఖ జేడీ వెంకటేశ్వరరావు పంపిణీ చేశారు. నవధాన్యాలుసాగు చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు ఆయన వివరించారు. ప్రతి రైతు తమ పొలాల్లో నవధాన్యాలు వేసుకుని సాగు చేయడం వల్ల భూమిలో నత్రజని పెరిగేందుకు దోహద పడుతుందన్నారు. ఏడీఏ అనిల్‌కుమారి, ఏవో జాన్సన్, సిబ్బంది పాల్గొన్నారు.

అష్టలక్ష్మి ఆవాహన హోమాలు

భీమవరంటౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీ వేంకటేశ్వర స్వామివారి 14వ వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అష్టలక్ష్మి ఆవాహన హోమాలు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు పర్యవేక్షణలో ఏడిద త్రిమూర్తులు, శేషు వరహాలక్ష్మి దంపతులు, నిమ్మల రాంబాబు, భువన దంపతులు, కొండపల్లి మోహన్ కుమార్, ఊహా శ్రీలక్ష్మి దంపతులచే అర్చకులు శ్రీనివాస చార్యులు శ్రీవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు.



ఆకివీడులోని సామాజిక ఆరోగ్య కేంద్రం

వైద్యం చేసేదెలా..?

ఆకివీడు సీహెచ్‌సీలో వైద్యుల కొరత

ఆకివీడు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): అతి ఖరీదైన వైద్యాన్ని ప్రభుత్వం ఉచితంగా అందించేందుకు వైద్యశాలలో అన్ని ఏర్పాట్లు చేసినా వైద్యుల కొరతతో రోగులకు అందని ద్రాక్షగా మారింది. స్థానిక 30 పడకల సీహెచ్‌సీలో ప్రసూతి వైద్య నిపుణురాలు లేక గర్భిణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నెలకు 20 పైనే డెలివరీలు కావాల్సి ఉండగా ఆసుపత్రిలో ఉంటున్న ఇతర వైద్యులు, నర్సులు సహకారంతో ఐదు డెలివరీలు కావడమే గగనమవుతుంది. ఆసుపత్రిలో ప్రసూతి వైద్య నిపుణురాలు లేరని తెలుసుకున్న గర్భిణులు నిరాశతో వెనుతిరుగుతున్నారు. 2023లో చేరిన ప్రసూతి వైద్య నిపుణులు ఈ ఏడాది ఫిబ్రవరి వరకూ పనిచేశారు. మార్చి నుంచి అనారోగ్య కారణంగా సెలవు పెట్టారు. ఇదిలా ఉండగా మార్చి నుంచి వారానికి రెండు రోజులు భీమవరం నుంచి ఆకివీడు ఆసుపత్రికి వచ్చి వైద్య సేవలందించేలా ప్రసూతి వైద్యురాలిని ఏర్పాటు చేసుకున్నారు. ఆ లేడీ డాక్టర్‌కు వెలగపూడి బదిలీ కావడంతో ఇక్కడ డెలివరీలు చేయడం కష్టతరంగా మారింది. అంతే కాక చిన్న పిల్లల వైద్యులు, జనరల్ ఫిజీషియన్ లేరు. ఆసుపత్రిలో స్థలం ఉన్నా పోస్టుమార్టం నిర్వహణకు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాల్లో మరణించిన వారి తాలూకా బంధువులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. వైద్యులను నియమించి సమస్య పరిష్కరించాలని స్థానిక గర్భిణులు, వ్యాధిగ్రస్తులు కోరుతున్నారు.


వేల్పూరులో ఆరిమిల్లి వెంకటరత్నంకు నివాళులు

ఆరిమిల్లి వెంకట రత్నం సేవలు స్ఫూర్తిదాయకం

తణుకు రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): తణుకు మండల మాజీ ఎంపీపీ ఆరిమిల్లి వెంకటరత్నం మండల అధ్యక్షుడిగా, వేల్పూరు సర్పంచ్‌గా అందించిన సేవలు స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ చెప్పారు. శుక్రవారం ఆరిమిల్లి వెంకటరత్నం వర్ధంతిని పురస్కరించుకుని వేల్పూరులోని ఎన్టీఆర్ పార్కు వద్ద, గ్రామ టీడీపీ కార్యాలయం వద్ద గల వెంకటరత్నం విగ్రహాలకు కూటమి నాయకుల ఆధ్వర్యంలో ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామంలో 1.60 ఎకరాల తన సొంత భూమిని వేల్పూరు పీహెచ్‌సీ నిర్మాణానికి విరాళంగా అందించారని, గ్రామంలో సొసైటీని స్థాపించి రైతులకు ఆర్థిక పరపతి కల్పించారని చెప్పారు.


యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి

గ్రామాలకు నాణ్యమైన విద్యుత్

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో అన్ని గ్రామాలకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ఎంత ఖర్చయినా వెనుకాడనని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. నందమూరులో 3 ఫేజ్ కరెంటు యూనిట్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడుతూ గ్రామస్థులు, సర్పంచ్ శనగన వరలక్ష్మి రాంబాబు, ప్రజలు 9 గంటలే కరెంటు ఉంటుందనే విషయం తన దృష్టికి తెచ్చారని దీంతో నందమూరు, మారంపల్లి, ఆరుళ్ల గ్రామాలకు రూ.50 లక్షలతో 3 ఫేజ్ కరెంటు ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీడీవో విశ్వనాథ్, విద్యుత్ శాఖ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

నెలాఖరు లోగా పార్టీ సంస్థాగత ఎన్నికలు పూర్తి కావాలి: పితాని

పెనుమంట్ర, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నెలాఖరు లోగా తెలుగుదేశం పార్టీ సంస్థా గత ఎన్నికలు పూర్తిచేయాలని మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. కొమ్ము చిక్కాలలోని తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్య నాయకులు, పార్టీ మండల అధ్యక్షులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ గ్రామ కమిటీలు వేసేందుకు మండల అధ్యక్షులతో పాటు ఇద్దరు క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, మరో ఇద్దరు సభ్యులతో కూడిన కమిటీ పర్యవేక్షణలో సమావేశం నిర్వహించి కొత్త గ్రామ కమిటీలు పూర్తి చేయాలని కోరారు. ఇప్పటికే సభ్యత్వాలు తీసుకున్న కార్యకర్తలకు ఐడీ కార్డులు పంపిణీ చేశామన్నారు. మండల కమిటీలు నియామకానికి నియోజకవర్గ పరిశీలకులతో పాటు రాష్ట్ర పరిశీల కులు హాజరవుతార న్నారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేసేందుకు 60 మందికి ఒక కుటుంబ సాధికార మిత్రులను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పార్టీ మండల అధ్యక్షుడు వెలిచేటి బాబు రాజేంద్రప్రసాద్, తమనంపూడి శ్రీనివాస్ రెడ్డి, కేతా మీరయ్య, జి. సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



భీమవరంలో సీతారామలక్ష్మి, నరసాపురంలో విప్ నాయకర్, పొత్తూరి వినతులు స్వీకరిస్తున్న దృశ్యం

ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం

భీమవరం అర్బన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ఆదేశాలతో ప్రజా సమస్యలపై వినతి పత్రాలు స్వీకరిస్తున్నట్టు టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి అన్నారు. శుక్రవారం భీమవరం నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ఆమె ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో స్థానిక ఎమ్మెల్యేలు, టీడీపీ ఇన్‌చార్జిలు ప్రతి శుక్రవారం ప్రజా సమస్యలపై వినతులు స్వీకరిస్తారన్నారు. ఈ వినతులు సంబంధిత అధికారులకు పంపి పరిష్కరించనున్నట్టు తెలిపారు. పట్టణ అధ్యక్షుడు ఇందుకూరి సుబ్రహ్మణ్యం రాజు, సుబ్బారావు, రజక కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పులూరి చంద్రశేఖర్, చెల్లబోయిన సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నరసాపురం టౌన్: ప్రజల నుంచి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ప్రభుత్వ విప్ నాయకర్, టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు అన్నారు. శుక్రవారం జనసేన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా విప్ నాయకర్, పొత్తూరి మాట్లాడుతూ వినతుల్ని క్షుణ్ణంగా పరిశీలించి వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో మరింత అభివృద్ధి : రఘురామ

పాలకోడేరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రజలు, దాతలు భాగస్వాములైతే నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేస్తానని ఉండి ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు తెలిపారు. శుక్రవారం ఆయన పెన్నాడలో పర్యటించారు. ప్రభుత్వ నిధులు, దాతల సహకారం రూ. 70 లక్షలతో నిర్మించిన బీసీ కళ్యాణ మండపం, రూ. 20 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డు, రైతు భరోసా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 15 నాటికి గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరిస్తానన్నారు. గ్రామంలో పంచాయతీకి చెందిన చెరువు, దేవస్థానం భూములు ఆక్రమణలకు గురయ్యాయని గ్రామస్థులు ఆయన దృష్టికి తేగా సత్వరమే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పెన్నాడ బీసీ కమ్యూనిటీ భవనాన్ని మిగతా గ్రామాల వారు స్ఫూర్తిగా తీసుకోవాలని తెలిపారు. కేవలం ప్రభుత్వం రూ. 5 లక్షలు ఇస్తే, దాతలు రూ. 65 లక్షలు ఖర్చులు సమకూర్చి భవనం నిర్మాణం పూర్తి చేయడం అభినందనీయమన్నారు. ఇటీవల కాలంలో పలువురు ఎర్ర జెండాలను పట్టుకుని అభివృద్ధిని అడ్డుకునేందుకు వస్తున్నారని, జనమే వీరిని అడ్డుకుంటే బాగుంటుందన్నారు. సర్పంచ్ చిల్లా అనూష, ఎంపీపీ భూపతి రాజు సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.



శ్రీదేవి ట్రస్ట్ సేవలు భేష్

కాళ్ళ: కాళ్ళకూరులో దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ తరఫున వెంకట రామరాజు సేవలు అభినందనీయమని ఏపీ డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామ కృష్ణరాజు అన్నారు. కాళ్ళకూరులో ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రం, నిత్యావసర సరుకుల పంపిణీ, విశ్రాంతి భవనాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం నియోజకవర్గంలో సీసీ కెమెరాలకు సంబంధించి రూ. 50 వేల చెక్కును ఎస్‌ఐ శ్రీనివాసరావుకు, అదే విధంగా గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరికి రూ. 5 వేలు చొప్పున రెండు చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఎస్సీ బోస్ కాలనీ గ్రామంలో సుమారు రూ. 9 లక్షలతో నిర్మించిన మైక్రో ఫిల్టర్స్‌ను సర్పంచ్ మంతెన శ్రీనివాసరాజుతో కలిసి ప్రారంభించారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్

ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించాలి

మండల పరిషత్ సమావేశంలో ఎమ్మెల్సీ వంకా

తణుకు రూరల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): అధికారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అభివృద్ధి పనుల బిల్లులను ఎప్పటికప్పుడు తయారు చేసి చెల్లించాలని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ అన్నారు. గురువారం తణుకు మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ అధ్యక్షుడు రుద్ర ధనరాజు అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ మండల పరిషత్ నిధులతో గ్రామాల్లో చేపట్టిన పనులకు సంబంధించిన సొమ్మును చెల్లించాలని కోరారు. మండల పరిషత్ సభ్యుల పదవీ కాలం ముగిసే లోపు వారు చేపట్టిన పనులతో పాటు వారికి చెల్లించవలసిన గౌరవ వేతనాలను కూడా చెల్లించాలని కోరారు. మహాలక్ష్మీ చెరువు సర్పంచ్ పాలా శ్రీను మాట్లాడుతూ తమ గ్రామంలో మంచినీరు అందడం లేదని, గ్రామంలో డ్రైన్‌లు నిర్మించకుండా రోడ్డు వేయడంతో మురుగునీరు నిలిచిపోతోందన్నారు. దువ్వ ఎంపీటీసీ పెనుమాక అశోక్, మండపాక ఎంపీటీసీ శ్రీనువాసులు మాట్లాడుతూ తమ గ్రామాల్లోని శ్మశాన వాటికలు ఆక్రమణలకు గురవుతున్నాయని గత సమావేశాల్లో చెప్పినా పట్టించుకోలేదన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకంలో గతంలో పంపిన డీపీఆర్‌లతో ఇళ్ల నిర్మాణం చేసుకున్న లబ్ధిదారులకు ఇప్పటికీ నిధులు మంజూరు కాలేదని దువ్వ సర్పంచ్ అడ్డా బాబు ఆరోపించారు. తహసీల్దార్ అశోక్ వర్మ మాట్లాడుతూ మండలంలో ధాన్యం కొనుగోలుకు సంబంధించి 7 లక్షల 40 వేల గోనె సంచులు అందుబాటులో వున్నాయన్నారు. జడ్పీటీసీ ముళ్లపూడి అన్నపూర్ణదేవి, ఎంపీడీవో శ్రీనివాస్, మండల పరిషత్ ఏవో వి. కృష్ణ చంద్రరావు, అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

'రఘురామ వ్యాఖ్యలు అవమానకరం'

భీమవరం అర్బన్/తణుకు రూరల్/ ఆచంట/ పెనుగొండ/యలమంచిలి/పాలకొల్లు టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావుపై చేసిన వ్యాఖ్యలు అవమానకరంగా ఉన్నాయని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బి. బలరాం, జిల్లా కార్యదర్శి జెఎన్‌వీ గోపాలన్ అన్నారు. శుక్రవారం భీమవరంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లా నాయకుడు వాసుదేవరావు పాల్గొన్నారు. రఘురామకృష్ణరాజు తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని ఆ పార్టీ కార్యదర్శి వర్గ సభ్యుడు పీవీ ప్రతాప్, పట్టణ కార్యదర్శి ఏ అజయకుమారి డిమాండ్ చేశారు. శుక్రవారం తణుకు నరేంద్ర సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఆచంట కచేరి సెంటర్‌లో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కేతా గోపాలన్ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. రఘురామకృష్ణరాజు వ్యాఖ్యలపై పెనుగొండలో సీపీఎం మండల కార్యదర్శి షేక్ పాదుషా ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. యలమంచిలి మండలం చించినాడ జాతీయ రహదారిపై శుక్రవారం మండల కార్యదర్శి కానేటి బాలరాజు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. రఘురామకృష్ణరాజును భర్తరఫ్ చేసి చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే దిగుబాటి రాజగోపాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం పాలకొల్లు గాంధీబొమ్మల సెంటర్ వద్ద ఆయన సీపీఎం నాయకులతో కలిసి ధర్నా నిర్వహించారు.

భవనంపై నుంచి పడిన కార్మికుడు

కాలులో దిగబడిన ఊచ

మొగల్తూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): నూతన భవన స్లాబ్ సెంటరింగ్ విప్పుతుండగా భవన నిర్మాణ కార్మికుడు కింద పడి ఊచలు కాలులో దిగిపోవడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. శుక్రవారం పేరుపాలెంలో నూతనంగా నిర్మిస్తున్న ఒక భవనం స్లాబ్ సెంట్రింగ్‌ను ఊడదీస్తుండగా ప్రమాదవశాత్తూ చామకూరి వెంకట గణేష్ అనే కార్మికుడు పై నుంచి పడిపోయాడు. ఈ ఘటనలో కార్మికుడి కాలులో ఇనుప ఊచ చొచ్చుకుని పోయింది. 108 సిబ్బంది కార్మికుడు కాలులో ఉండిపోయిన ఇనుప ఊచను కట్ చేసి వైద్యం కోసం ఆసుపత్రికి తరలించారు.


యశస్విని‌కి మెమెంటో అందిస్తున్న కలెక్టర్

యశస్వినికి కలెక్టర్ అభినందన

కాళ్ళ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రయివేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబర్చడం శుభపరిణామమని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శుక్రవారం పెద అమిరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కాళ్ళ హైస్కూల్‌లో చదివిన నిమ్మల యశస్విని 586/600 మార్కులు సాధించి మండలంలో మొదటి స్థానంలో నిలవడంతో కలెక్టర్ ఆమెకు మెమెంటో, ప్రశంసా పత్రం అందజేసి సత్కరించారు. డీఈవో, ఎంఈవో, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థిని తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై దాణా పొందండి

అత్తిలి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : పశుసంవర్ధక శాఖ ద్వారా రైతులకు 50 శాతం సబ్సిడీ పై పశువుల దాణా అందజేస్తున్నారని జిల్లా జంతు సంక్షేమ సంఘం డైరెక్టర్ ఆల్తి అజయ్‌కుమార్ తెలిపారు. 50 కేజీల దాణా ధర రూ. 1200 కాగా లబ్ధిదారులు రూ. 55 చెల్లిస్తే సరిపోతుందన్నారు. తెల్ల రేషన్ కార్డు కలిగి ఉండాలని పశుసంవర్ధకశాఖ సహాయకుని వద్ద పేర్లు నమోదు చేయించుకోవాలని అజయ్‌కుమార్ కోరారు.

సమస్యలు పరిష్కరిస్తాం: ఆర్డీవో

మొగల్తూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): రీ సర్వేలో ఉత్పన్నమైన అన్ని సమస్యలను పరిష్కరిస్తామని నరసాపురం ఆర్డీవో దాసి రాజు తెలిపారు. కేపీ పాలెంలో చేపట్టిన రీ సర్వేలో తమ భూ సమస్యలు పరిష్కారం కాలేదని ఇద్దరు రైతులు చేసుకున్న ఫిర్యాదులపై ఆయన విచారణ నిర్వహించారు. సమస్యలు పరిశీలించి బాధితులకు న్యాయం చేస్తామన్నారు. సర్పంచ్ కడలి సొంబాబు, తహసీల్దార్ రాజ్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ వీఆర్వో సత్యనారాయణ మృతి

మొగల్తూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మొగల్తూరుకు చెందిన మాజీ మునసబు, మాజీ వీఆర్వో గురుజు వీర వెంకట సత్యనారాయణ (72) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. రామన్నపాలెం మునసబుగా సేవలందించిన ఆయన వీఆర్వో వ్యవస్థలోనూ కేపీ పాలెంలో వీఆర్వోగా రెవెన్యూ శాఖలో సుదీర్ఘకాలం సేవలందించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఆయన మృతికి కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బా రాయుడు, సర్పంచ్ పడవల మేరీ, వైస్ ఎంపీపీ సుబ్బారావు సంతాపం తెలిపారు.


గణపవరంలో ముస్లింల ర్యాలీ



భీమవరం ప్రకాశంచౌక్‌లో కొవ్వొత్తుల ర్యాలీ, తాడేపల్లిగూడెంలో కూటమి నిరసనలు

ఉగ్రదాడిపై పెల్లుబికిన నిరసన

గణపవరం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పహల్గాంలో ఉగ్రవాదుల నరమేధాన్ని నిరసిస్తూ శుక్రవారం గణపవరంలోని ముస్లింలు ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడ్డారు. తొలుత మసీదులో నమాజ్ చేసి నల్లబ్యాడ్జీలు ధరించి భారతదేశ ఐక్యతవర్ధిల్లాలని, హిందూస్థాన్ జిందాబాద్, పాకిస్తాన్ ముర్దాబాద్ అంటూ హిందూ ముస్లిం బాయిబాయి అంటూ నినాదాలు చేశారు. ఉగ్రవాదాన్ని ప్రేరేపిస్తున్న పాకిస్తాన్‌కు బుద్ధి చెప్పాలని ముస్లింల పెదగురువు అరమాన్ రజాక్ ఖాద్రి డిమాండ్ చేశారు.

ఆకివీడు: ఉగ్రవాదాన్ని కూకటి వేళ్ళతో పెకలించాలని జేఏసీ ముస్లింలు అన్నారు. శుక్రవారం స్థానిక పెద్ద మసీద్‌లో నమాజ్ అనంతరం ఉగ్రవాద దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులర్పించారు. ఉగ్రవాదానికి మతానికి సంబంధం లేదని, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

తాడేపల్లిగూడెం అర్బన్: అమాయకులపై ఉగ్రవాదుల మారణకాండ అత్యంత హేయమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటువంటి దుశ్చర్యకు పాల్పడిన వారిపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. దాడిలో మృతి చెందిన వారి కుటుంబాలకు సంతాపం తెలిపారు.

● అమాయకులపై ఉగ్రవాదుల దాడి అత్యంత దుర్మార్గమని ఎమ్మెల్యే బొలిశెట్టి అన్నారు. ఉగ్రదాడిని శుక్రవారం కూటమి నాయకులు తీవ్రంగా నిరసించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి మాట్లాడుతూ ఉగ్రవాద చర్యను దేశమంతా తీవ్రంగా ఖండిస్తుందన్నారు. బీజేపీ కన్వీనర్ ఈతకోట తాతాజీ మాట్లాడుతూ జరిగిన సంఘటన చాలా దారుణమన్నారు. ఉగ్రవాదులపై శిక్షించేందుకు ఇప్పటికే బీజేపీ ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. అనంతరం పట్టణంలో మానవహారం నిర్వహించారు. వర్తనపల్లి కాశి, పాలూరి వెంకటేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నరసాపురం టౌన్: కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో పంజా సెంటర్‌లో నిరసన చేశారు. వీరి నిరసనకు ముస్లింలు సంఘీభావం తెలిపారు. టూరిస్టులపై దాడి చేసిన వార్ని కఠినంగా శిక్షించాలన్నారు. అనంతరం మృతులకు నివాళులర్పించారు. కవురు పెద్దిరాజు, ముచ్చర్ల త్రిమూర్తులు, రామ్మోహన్‌రావు, టి సత్యనారాయణ, బి. జోగేశ్వరరావు, గంగయ్య పాల్గొన్నారు.

భీమవరం అర్బన్: ఉగ్రవాదాన్ని తుదముట్టించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మృతులకు నివాళులర్పించారు.

భీమవరం టౌన్: పహల్గామ్‌లో భయానక ఉగ్రదాడిని ఖండిస్తున్నామని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం ప్రకాశం చౌక్ లో శుక్రవారం రాత్రి కూటమి నాయకుల ఆధ్వర్యంలో శాంతియుత క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పహల్గామ్ ఉగ్రదాడిలో మరణించిన వారికి సంతాపం తెలిపారు. భీమవరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో స్వచ్ఛంద సంస్థలు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం ఉగ్రవాదుల దాడుల మరణించిన కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. టీడీపీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారధి, ఛాంబర్ అధ్యక్షుడు కోటేశ్వరరావు, కేజీఆర్ఎల్ కళాశాల సంయుక్త కార్యదర్శి ఆరేటి ప్రకాష్, బీజేపీ నాయకులు ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎ. వీరయ్య, చెరుకువాడ రంగసాయి

ఉండి: ఉగ్రవాదులకు తగిన గుణపాఠం చెప్పాలని ఉండి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి జుత్తిగ నాగరాజు అన్నారు. శుక్రవారం ఉండిలో జనసేన ఆధ్వర్యంలో నిరసన తెలిపి మానవహారం నిర్మించారు. వర్కింగ్ ప్రెసిడెంట్ దారపురెడ్డి కన్నబాబు, ఉండి, ఆకివీడు, కాళ్ల, పాలకోడేరు మండల జనసేన కన్వీనర్లు పాల్గొన్నారు.